# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 02 సంచిక - 328 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- శుక్రవారం 21 నవంబర్ 2025


**సత్యసాయి జయంతి వేడుకలకు తప్పకరండి...**





**నేడు హైదరాబాద్‌కు రాష్ట్రపతి రాక**




## బీహార్ సిఎంగా నితీశ్ ప్రమాణం

- 27మంది మంత్రులు కూడా ప్రమాణం
- ప్రమాణం చేయించిన గవర్నర్
- హాజరైన మోడీ, అమిత్ షా, చంద్రబాబు



### తిరుపతి చేరుకున్న రాష్ట్రపతికి
## ఘనంగా స్వాగతం

**తిరుచానూరులో పద్మవాతి అమ్మవారి దర్శనం**

**నేడు శ్రీవారిని దర్శించుకోనున్న ముర్ము**



**తిరుమల,నవంబర్20(పీసీడబ్ల్యూ న్యూస్):** భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మ గురువారం మధ్యాహ్నం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్నారు. ఈ సందర్భంగా ఏపీ రాష్ట్ర హోమ్ మంత్రి వంగలపూడి అనిత, టీటీడీ ఉన్నతాధికారులతో పాటు కూటమిలోని పార్టీల నేతలు ఆమెకు ఘనస్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గం ద్వారా తిరుచానూరుకు రాష్ట్రపతి చేరుకున్నారు. తిరుచానూరులో మిగతా2లో...



## సిబిఐ కోర్టుకు హాజరైన జగన్

**వ్యక్తిగత హాజరుతో పూర్తయిన లాంఛనం**

**జగన్ రాకతో అభిమానుల హల్‌చల్**

**హైదరాబాద్,నవంబర్20(పీసీడబ్ల్యూ న్యూస్):** అక్రమాస్తుల కేసులో వైకాపా అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్ సీబీఐ ప్రత్యేక కోర్టుకు హాజరయ్యారు. న్యాయమూర్తి ఎదుట విచారణకు వచ్చారు. విజయవాడ నుంచి బేగంపేట ఎయిర్‌పోర్టుకు వచ్చి అక్కడి నుంచి నాంపల్లిలోని కోర్టుకు ఆయన మిగతా2లో...

# గవర్నర్లు, రాష్ట్రపతికి గడవు విధించలేం

**గవర్నర్లకు మూడు అంశాల్లోనే నిర్ణయం**

**సుప్రీంకోర్టు ధర్మాసనం కీలక తీర్పు**

**న్యూఢిల్లీ,నవంబర్20(పీసీడబ్ల్యూ న్యూస్):** గవర్నర్,రాష్ట్రపతి అధికారాలపై భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు గురువారం కీలక తీర్పు వెలువరించింది. పెండింగ్ బిల్లుల ఆమోదానికి సంబంధించిన అంశంలో రాష్ట్రపతి, గవర్నర్లకు గడువును విధించటం తగదని స్పష్టం చేసింది. కారణం చెప్పకు ఒడా గవర్నర్‌లు బిల్లులను వెనక్కి పంపలేరని తెలిపింది. బిల్లును నిరవధికంగా నిలిపివేసే అధికారం గవర్నర్‌కు లేదని కూడా తేల్చి చెప్పింది. గవర్నర్ బిల్లును రాష్ట్రపతికి పంపితేనే రాష్ట్రపతి చర్యలు తీసుకోగలరని చెప్పింది. ఆర్టికల్ 200 ప్రకారం గవర్నర్‌కు విచక్షణాధికారం ఉందని వెల్లడించింది. తన ముందుకు వచ్చిన



బిల్లులను గవర్నర్ రాష్ట్రపతికి పంపడం, అభిప్రాయాలతో తిరిగి పంపడం, బిల్లును పరిశీలించి సూచనలు ఇవ్వడం వంటివి మాత్రమే చేస్తారని తెలిపింది. రాష్ట్ర పరిపాలనలో తుది అధికారం ఎన్నుకోబడిన మంత్రివర్గానిదేనని స్పష్టం చేసింది. మిగతా2లో...

## దేశవ్యాప్తంగా సన్నబియ్యం పంపిణీ

**కేంద్రమంత్రికి సిఎం రేవంత్ సూచన**

**పరిశీలిస్తామన్న మంత్రి ప్రహ్లాద్ జోషి**



**హైదరాబాద్,నవంబర్20(పీసీడబ్ల్యూ న్యూస్):** దేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణలో రేషన్ షాపుల్లో వినియోగదారులకు సన్న బియ్యాన్ని సరఫరా చేస్తున్నామని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. గురువారం ఉదయం

మిగతా2లో...

### స్థానిక ఎన్నికల రిజర్వేషన్లపై
## ప్రభుత్వానికి నివేదిక

**డిసెంబర్ 11లోపు నోటిఫికేషన్‌కు ఛాన్స్**

**పంచాయితీరాజ్ శాఖ మంత్రి సీతక్క వెల్లడి**



**హైదరాబాద్,నవంబర్20(పీసీడబ్ల్యూ న్యూస్):**పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లపై డెడికేటెడ్ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. పంచాయతీలు, వార్డుల వారీగా ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు 50 శాతం మించకుండా సిఫారసు చేసింది. డెడికేటెడ్ కమిషన్ ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లు ఖరారు చేయనుంది. ఈనెల 24న హైకోర్టు విచారణకు ముందే రాష్ట్ర ప్రభుత్వం ఈ పక్రియను పూర్తి చేయనుంది. ఈనెల 24 లేదా 25న షెడ్యూల్ ప్రకటించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధమైంది. 12,733 పంచాయతీ, 1,12,288 వార్డుల్లో డిసెంబరు 16 వరకు మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు పూర్తి చేసేలా కసరత్తు చేస్తోంది. ఇదిలావుంటే వచ్చే నెల డిసెంబర్ 11వ తేదీ లోపు పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉందని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క చెప్పారు. గురువారం కామారెడ్డి జిల్లా భిక్కనూరులో జరిగిన సభలో ఆమె మాట్లాడారు. అనంతరం మండలంలోని బస్వాపూర్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ముందుగా గ్రామ పంచాయతీలకు, తర్వాత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ఉంటా యని అన్నారు. పంచాయతీ ఎన్నికలకు మిగతా2లో...




## 10వ తరగతి ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారం

**బండి సంజయ్‌పై కేసు కొట్టివేసిన హైకోర్టు**

**మరో కేసులో నాంపల్లి కోర్టుకు హాజరైన బండి**



**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు**
## బిగ్ షాక్

**- ఫార్ములా -కారు రేసు కేసు**

**విచారణకు గవర్నర్ అనుమతి**

**హైదరాబాద్,నవంబర్20(పీసీడబ్ల్యూ న్యూస్):** మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు బిగ్ షాక్ తగిలింది. ఈ ఫార్ములా -కారు రేసు కేసుకు సంబంధించి ఆయనపై విచారణ చేపట్టేందుకు గవర్నర్ అధికారికంగా అనుమతి మంజూరు చేశారు. ఈ కేసులోనిధుల దుర్వినియోగంపై విచారణ కొనసాగించేం దుకు గవర్నర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. గవర్నర్ అనుమతితో ఏసీబీ త్వరలోనే కేటీఆర్‌పై చార్జ్‌షీట్ దాఖలు చేయనుందని సమాచారం. ప్రభుత్వం ఈ విషయంలో లేఖ రాయడంతో ఫార్ములా ఈ-కార్ రేసింగ్ కేసులో మాజీ మంత్రి కేటీఆర్‌ను ఏసీబీ విచారించేందుకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అనుమతించారు. మిగతా2లో...



**నిజంగా నీవు సింహానివే**

**శ్రీహరి**

అడవికి రాజు సింహం అని
కథలు విన్నాము గాని
నిజముగా వింటున్నాము
నీ చరిత్రను. నీ ప్రయాణాన్ని.
దండకరణ్యంలో నీ పేరు
మారు మ్రోగింది సింహంల
అడవికి రాజు సింహం అన్నది
ఒక ఊహ. ఒక కల్పిత కథ
నిజజీవితంలో నీవు సింహానివే
అడవికి రాజువే.
నీ మరణం ఒక అగ్ని కణంల
మండుతు వుంటాది
అందులో నుండి పుట్టుకోస్తారుమళ్ళీ
ఎందరో హిడ్మాలు.
నీ మరణం ఆదివాసీలకు
తీరని బాధ.తీరని లోటు కానీ
వారి గుండల్లో చిరస్మనీయుడావు!

### పెట్టుబడులకు
# హైదరాబాద్ వేదిక

**- తెలంగాణ నార్త్ ఈస్ట్ టెక్నో కల్చరల్ ఫెస్టివల్‌లో రేవంత్**




**హైదరాబాద్,నవంబర్20(పీసీడబ్ల్యూ న్యూస్):**పెట్టుబడులకు హైదరాబాద్ వేదికగా మారిందని, తాము పక్క రాష్ట్రాలతో కాకుండా దుబాయ్, సింగపూర్ లాంటి దేశాలతో పోటీ పడతామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ వేదికగా 6 రోజుల పాటు రెండు విడతలుగా జరిగే తెలంగాణ నార్త్ ఈస్ట్ టెక్నో కల్చరల్ ఫెస్టివల్‌ను గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రారంభించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావ్, సీఎస్ రామకృష్ణారావు, డీజీపీ శివధర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ వివిధ రంగాల్లో దూసుకుని పోయేలా కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని అన్నారు. త్రిపుర గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి గౌరవ అతిథిగా హాజరయ్యారు. తెలంగాణతో పాటు పాటు 8 ఈశాన్య రాష్ట్రాలకు చెందిన 600 మంది పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 21, 22 తేదీల్లో మొదటి దశ ఫెస్టివల్‌లో సినిమాలు, సాహిత్యం వంటి అంశాలపై సెమినార్లు, చర్చా గోష్టిలు, ప్రదర్శనలు ఉంటాయని, 25 నుంచి 27 వరకు సాగే 2వ విడతలో ఆరోగ్యం, సాంకేతికత వంటి అంశాలపై చర్చలు ఉంటాయని చెప్పారు. రోజూ 2వేల మంది ఈ కార్యక్రమంలో పాల్గొంటారని, 40 మంది పౌర పురస్కార విజేతలు కూడా దీనికి మిగతా2లో...

# గవర్నర్లు, రాష్ట్రపతికి గడవు విధించలేం

**(మొదటి పేజీ తరువాయి)**

ఒక రాష్ట్రంలో రెండు ఎగ్జిక్యూటివ్ పవర్స్ ఉండవని, ప్రభుత్వం ఒక్కటే ప్రధాన నిర్ణయాధికారి అని తేల్చి చెప్పింది. రాష్ట్రాల శాసనసభలు ఆమోదించి పంపిన బిల్లులకు ఆమోదం తెలిపే విషయంలో న్యాయస్థానం రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధించటంపై ఆర్టికల్ 143 కింద రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పంపిన ప్రెసిడెన్షియల్ రిఫరెన్స్‌పై స్పందిస్తూ సుప్రీంకోర్టు ఈ తీర్పును వెలువరించింది. రాష్టర శాసనసభలు ఆమోదించి పంపించిన బిల్లులకు సమ్మతి తెలిపే అంశంలో సుప్రీంకోర్టు గురువారం కీలక తీర్పు వెలువరించింది. ఈ విషయంలో రాష్ట్రపతి, గవర్నర్లకు న్యాయస్థానం గడువు విధించడంపై దేశ ప్రథమ పౌరురాలు ద్రౌపదీ ముర్ము సంధించిన ప్రశ్నలపై అత్యున్నత న్యాయస్థానం సమాధానమిచ్చింది. పెండింగ్ బిల్లుల ఆమోదం కోసం రాష్ట్రపతి, గవర్నర్లకు గడువును విధించడం తగదని సీజేఐ జస్టిస్ బి.ఆర్. గవాయ్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే, కారణం చెప్పకుండా గవర్నర్లు బిల్లులను వెనక్కి పంపలేరని వెల్లడించింది. ఈ మేరకు దీనిపై గతంలో ద్విసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పును సీజేఐ ధర్మాసనం పక్కనబెట్టింది. గవర్నర్‌కు రాజ్యాంగపరంగా మూడు అప్షన్లు ఉంటాయి. బిల్లులకు సమ్మతి తెలియజేయడం, కారణం చెప్పి బిల్లును రిజర్వ్‌లో పెట్టడం లేదా రాష్ట్రపతికి పంపడం, బిల్లును తిరస్కరించి అసెంబ్లీకి పంపడం. ఈ మూడు అప్షన్లు ఎంచుకోవడంలో గవర్నర్ విచక్షణాధికారాన్ని ఉపయోగిస్తారు. ఇందుకు న్యాయస్థానాలు గడువు విధించడం సబబు కాదని అభిప్రాయపడ్డారు. గవర్నర్ల విధుల నిర్వహణ వ్యవహారాల్లో కోర్టులు జోక్యం చేసుకోవు. కానీ, కారణం లేకుండా దీర్ఘకాలంగా బిల్లులను పెండింగ్‌లో ఉంచిన సందర్భాల్లో కోర్టులు పరిమిత విచక్షణతో వ్యవహరించొచ్చు. రాష్ట్రపతి విషయంలోనూ ఇదే వర్తిస్తుంది. నిరవధిక ఆలస్యం కొనసాగుతున్న సందర్భాల్లో అది న్యాయసమీక్ష పరిధిలోకి వస్తుందని తెలిపారు. గవర్నర్ బిల్లును రాష్ట్రపతికి రిజర్వ్ చేసిన ప్రతిసారీ ఆర్టికల్ 143 కింద రాష్ట్రపతి సుప్రీంను సంప్రదించాల్సిన అవసరం లేదు. ఆర్టికల్ 200 కింద గవర్నర్లకు విచక్షణాధికారం ఉంటుంది. అయితే, దాన్ని అపరిమితంగా వినియోగించ లేరు. శాసనసభలు ఒకటికి రెండుసార్లు ఆమోదించిన బిల్లులను గవర్నర్లు ఆమోదం తెలపకుండా కాలయాపన చేయడం, రాష్ట్రపతి పరిశీలనలో ఉన్నవీ తీవ్ర జాప్యానికి గురికావడంపై ఈ ఏడాది ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు సంచలన నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ అంశంలో గవర్నర్‌తో పాటు రాష్ట్రపతికీ గడువు విధించింది. గరిష్ఠంగా మూడు నెలల్లోగా ఆ బిల్లులను ఆమోదించడమో, తిప్పి పంపించడమో చేయాలని జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్ ధర్మాసనం నిర్దేశిరచింది. రాజ్యాంగ అధికరణం 143(1) ప్రకారం తనకున్న అధికారాన్ని వినియోగిస్తూ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మే నెలలో పలు ప్రశ్నలతో సీజేఐకి లేఖ రాశారు. రాష్ట్రపతి విచక్షణ అధికారాల పరిధిలోకి వచ్చే రాష్ట్రాల బిల్లులకు ఆమోదం తెలిపే అంశంలో న్యాయస్థానం గడువు విధించడం ఎంతవర కు న్యాయ సమ్మతమో తెలపాలంటూ సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని కోరారు. దీనిపై సీజేఐ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటైంది. పది రోజుల పాటు అన్ని పక్షాల వాదనలను ఆలకించిన ధర్మాసనం సెప్టెం బరు 11న తీర్పు రిజర్వు చేసింది. రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధించలేమంటూ తాజాగా తీర్పు వెలువరించింది.

# 10వ తరగతి ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారం

**హైదరాబాద్,నవంబర్20(పీసీడబ్ల్యూ న్యూస్):** కేంద్ర హోమ్ శాఖ మంత్రి బండి సంజయ్‌కు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. గతంలో కమలాపూర్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసును గురువారం నాడు హైకోర్టు కొట్టేసింది. 2023లో 10వ తరగతి ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంపై ఈ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఇందులో బండి సంజయ్ పేరును ప్రధాన నిందితుడిగా కమలాపురం పోలీసులు చేర్చారు. రాజకీయ కక్షల కారణంగానే ఈ కేసు నమోదు చేశారని హైకోర్టుకు బండి సంజయ్ న్యాయవాది తెలిపారు. కేసు నమోదులో సరైన సెక్షన్లు కానీ.. దర్యాప్తులో పూర్తి వివరాలు కానీ లేవని హైకోర్టు ఈ సందర్భంగా స్పష్టం చేసింది. ఈ కేసును కొట్టేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఇదిలావుంటే బండి సంజయ్ గురువారం నాంపల్లి ప్రజా ప్రతినిధుల కోర్టుకు హాజరయ్యారు. గతంలో తనపై నమోదైన పలు కేసుల నేపథ్యంలో విచారణ కోసం కోర్టు వెళ్లారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బండి సంజయ్ పని చేసిన విషయం తెలిసిందే.ఆ సమయంలో నల్గొండలోని వడ్ల కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్, బీజేపీ నేతల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. అలాగే హుజూర్‌నగర్ నియోజకవర్గం నేరేడుచర్ల లో బండి సంజయ్ కాన్వాయ్‌పై బీఆర్ఎస్ నేతలు రాళ్ల దాడి చేశారు. నాటి ఘటనల్లో బండి సంజయ్‌పై పోలీసులు మూడు కేసులు నమోదు చేశారు. ఈ కేసుల విచారణలో భాగంగానే కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్.. నాంపల్లి ప్రజా ప్రతినిధుల కోర్టుకు హాజరయ్యారు. అయితే, విచారణ అనంతరం జనవరి 7వ తేదీకి ఈ కేసును న్యాయమూర్తి వాయిదా వేశారు.

# కెటిఆర్‌పై అక్రమ కేసులు రేవంత్ లక్ష్యం



## రాజకీయ కక్షసాధింపునకు పరాకాష్ట

## బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శ

**హైదరాబాద్,నవంబర్20(పీసీడబ్ల్యూ న్యూస్):** హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీని పెంచిన కేటీఆర్‌పై అక్రమ కేసులు బనాయించి ఇబ్బంది పెట్టడమే రేవంత్ రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నాడని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగడుతున్న కేటీఆర్‌పై అక్రమ కేసులు బనాయించి రాక్షసానందం పొందటం అప్రజాస్వామికమన్నారు. కేటీఆర్‌పై రాజకీయ కక్ష సాధింపు చర్యలకు ఇది పరాకాష్ఠ అని ఆయన విమర్శించారు. ఈ ప్రభుత్వం ప్రశ్నించే వారి గొంతులు నొక్కే ప్రయత్నం చేస్తోందన్నారు. ప్రతిపక్ష నేతలను వేధించడమే సీఎం రేవంత్‌రెడ్డి పనిగా పెట్టుకున్నారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచిన కేటీఆర్‌పై అక్రమ కేసులు పెట్టారు. స్థానిక ఎన్నికల్లో రాజకీయ లబ్ది కోసం చిల్లర డ్రామాలు చేస్తున్నారు. కేటీఆర్‌కు అండగా ఉంటాం అని హరీశ్‌రావు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల వేళ రాజకీయ లబ్ది పొందేందుకు చేస్తున్న చిల్లర డ్రామాలను ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. అక్రమ కేసులతో కేటీఆర్, బీఆర్ఎస్ నాయకుల మనోస్థైర్యాన్ని దెబ్బతీయలేరని ఎక్స్ వేదికగా వెల్లడించారు. 'మా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై రాజకీయకక్ష సాధింపు చర్యలకు పరాకాష్ట ఇది. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి ప్రశ్నించే గొంతులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నొక్కే ప్రయత్నం చేస్తుండటం దుర్మార్గం. పూర్తి పారదర్శకతతో నిర్వహించిన ఫార్ములా ఈ-రేస్‌లో రెండేళ్లుగా కోడిగుడ్డుపై ఈకలు పీకుతున్నది కాంగ్రెస్ సర్కార్. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీని పెంచిన కేటీఆర్‌పై అక్రమ కేసులు బనాయించి ఇబ్బంది పెట్టడమే లక్ష్యంగా పెట్టుకున్నడు రేవంత్ రెడ్డి. ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగడుతున్న కేటీఆర్ పై అక్రమ కేసులు బనాయించి రాక్షసానందం పొందటం అప్రజాస్వామికం.స్థానిక సంస్థల ఎన్నికల వేళ రాజకీయ లబ్ది పొందేందుకు చేస్తున్న చిల్లర డ్రామాలను ప్రజలు గమనిస్తున్నారు. అక్రమ కేసులతో కేటీఆర్, బిఆర్ఎస్ నాయకుల మనోస్థైర్యాన్ని దెబ్బతీయలేరు. కేటీఆర్‌కు బీఆర్ఎస్ పార్టీ పూర్తి అండగా ఉంటుంది. రేవంత్ రెడ్డి దుర్మార్గ వైఖరిని న్యాయపరంగా ఎదుర్కొంటాం.' అని ట్వీట్ చేశారు.

# బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు బిగ్ షాక్

**(మొదటి పేజీ తరువాయి)**

ఈ కేసులో ఇప్పటికే పలుమార్లు కేటీఆర్ ఏసీబీ విచారణకు హాజరయ్యారు. ఫార్ములా ఈ-కార్ రేసింగ్‌లో రూ.54.88 కోట్ల నిధుల దుర్వినియోగం జరిగినట్లు ఆరోపణలున్నాయి. ఈక్రమంలో కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతి కోరుతూ గతంలో ఏసీబీ లేఖ రాసింది. ఆయన పాత్రపై సాక్ష్యాలు ఉన్నాయంటూ అందులో పేర్కొంది. ఈక్రమంలో తాజాగా ఏసీబీ అధికారులకు అనుమతి ఇస్తూ గవర్నర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఫార్ములా ఈ-కార్ రేసింగ్ కేసులో త్వరలోనే ఏసీబీ ఛార్జ్‌షీట్ దాఖలు చేయనుంది. ఈ కేసులో కేటీఆర్‌ను ఏ-1 గా, సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ ను ఏ-2గా ఏసీబీ పేర్కొంది. ఇప్పటికే కేటీఆర్ ఈ కేసు విషయంలో ఏసీబీ విచారణకు నాలుగు సార్లు హాజరయ్యారు. ఈ కేసులో ఏ-2గా ఉన్న ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ విషయంలో తదుపరి చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులు ఇప్పటికే కేంద్రంలోని డీఓపీటీకు లేఖ రాశారు. గవర్నర్ అనుమతి నేపథ్యంలో, చార్జ్‌షీట్ దాఖలుకు ముందు ఏసీబీ అధికారులు మరోసారి కేటీఆర్‌ను లేదా ఇతర కీలక వ్యక్తులను విచారించే అవకాశం ఉంది. ఈ కేసుపై గవర్నర్ అనుమతి లభించడంతో, రాజకీయ వర్గాలలో, పరిపాలనా వర్గాలలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఏసీబీ త్వరలో దాఖలు చేయబోయే చార్జ్‌షీట్‌తో ఈ కేసు విచారణ కీలక మలుపు తిరగనుంది. ఫార్ములా ఈ-కారు రేసులో క్విడ్ ప్రోకో జరిగినట్టు ఏసీబీ నివేదిక ఇచ్చిన విషయం తెలిసిందే. రూ.54.88 కోట్ల నిధులు దారి మళ్లింపుపై ఆరోపణలు చేసింది. ఇక, 2024లో ఫార్ములా ఈ-కారు కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కార్ రేస్ వ్యవహారంలో 2024 డిసెంబర్ నెలలో ఏసీబీ కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. మాజీ మంత్రి కేటీఆర్‌ను ఏ1గా ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. కేసు విచారణలో భాగంగా ఇప్పటికే కేటీఆర్‌ను రెండు సార్లు, ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్‌ను 3 సార్లు ఏసీబీ అధికారులు విచారించారు. తాజాగా ప్రభుత్వానికి నివేదికను సమర్పించారు. కేసుకు సంబంధించిన నివేదికను అవినీతి నిరోధక శాఖ( ఏసీబీ) అధికారులు మంగళవారం తెలంగాణ ప్రభుత్వానికి అందించారు. ప్రాసిక్యూషన్ అనుమతి కోరుతూ ఏసీబీ అధికారులు ఈ నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేటీఆర్ మున్సిపల్ శాఖ మంత్రిగా పనిచేశారు. కేటీఆర్‌ను ఈ కేసులో ఏ1గా పేర్కొంటూ ఏసీబీ కేసు నమోదు చేసింది. ఫార్ములా- ఈ కార్ రేసు నిర్వహణ కోసం యూకేకు చెందిన ఫార్ములా-ఈ ఆపరేషన్స్, ఏస్ నెక్ట్సజెన్ ప్రైవేట్ లిమిటెడ్, తెలంగాణ పురపాలకశాఖ 2022 అక్టోబరు 25న ఒప్పందం చేసుకున్నాయి. ఈ ఒప్పందం ప్రకారం కార్ రేస్ నిర్వహణకు అయ్యే ఖర్చును స్పాన్సర్‌గా ఉన్న ఏస్ నెక్ట్స్ జెన్ ప్రైవేట్ లిమిటెడ్ భరించాలి. అలాగే కార్ రేసు నిర్వహణకు వీలుగా తెలంగాణ పురపాలక శాఖ ట్రాక్‌ను ఏర్పాటు చేయాలి. అందులో భాగంగా 2023 ఫిబ్రవరి 11 జరిగిన రేస్ కోసం తెలంగాణ పురపాలక శాఖ తరుఫున హెచ్ఎండీఏ రూ.12 కోట్లు ఖర్చు చేసింది. రేసు నిర్వహణ ఖర్చును స్పాన్సర్‌గా ఉన్న ఏస్ నెక్ట్స్ జెన్ భరించింది.

# నేడు హైదరాబాద్‌కు రాష్ట్రపతి రాక

- రేపు తిరిగి పుట్టపర్తికి ముర్ము ప్రయాణం



**హైదరాబాద్,నవంబర్20(పీసీడబ్ల్యూ న్యూస్):** తిరుమల పర్యటన ముగించుకుని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం మధ్యాహ్నం 1.10 గంటలకు ప్రత్యేక విమానంలో బేగంపేట ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా ఆమె రాజ్ భవన్‌కు వెళ్తారు. మధ్యాహ్నం భోజనం చేసి.. రాజ్ భవన్‌లో విశ్రాంతి తీసుకుంటారు. ఆ తర్వాత 3:50 గంటలకు బొల్లారంలోని రాష్ట్రపతి నిలయానికి ఆమె చేరుకుంటారు. సాయంత్రం 4.00 గంటలకు రాష్ట్రపతి నిలయం వేదికగా నిర్వహించే భారతీయ కళా మహోత్సవాన్ని రాష్ట్రపతి ముర్ము ప్రారంభిస్తారు. తిరిగి సాయంత్రం 6:15 గంటలకు ఆమె తిరిగి రాజ్ భవన్‌కు చేరుకుంటారు. రాత్రి తెలంగాణ రాజ్‌భవన్‌లో రాష్ట్రపతి ముర్ము బస చేయనున్నారు. 22వ తేదీ అంటే..శనివారం ఉదయం 9:30 గంటలకు బేగంపేట ఎయిర్ పోర్ట్ నుంచి ప్రత్యేక విమానంలో ఆంధ్రప్రదేశ్ శ్రీసత్యసాయి జిల్లాలోని పుట్టపర్తికి బయలుదేరి వెళ్తారు. శ్రీ సత్యసాయి బాబా శత జయంత్యోత్సవాల్లో రాష్ట్రపతి ముర్ము పాల్గొనున్నారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో హైదరాబాద్‌లో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

# బీహార్ సీఎంగా నితీశ్ ప్రమాణం



**పాట్నా,నవంబర్20(పీసీడబ్ల్యూ న్యూస్):** బిహార్ సీఎంగా జేడీయూ అధినేత నితీశ్ కుమార్ గురువారం ప్రమాణస్వీకారం చేశారు. సిఎంగా ఆయన ప్రమాణస్వీకారం చేయడం ఇది పదోసారి. పట్నాలోని గాంధీ మైదానంలో నితీశ్‌తో పాటు 27 మంది మంత్రులు ప్రమాణస్వీకారం చేయగా.. సామ్రాట్ చౌదరీ, విజయ్ కుమార్ సిన్హాలకు డిప్యూటీ సీఎం పదవులు దక్కాయి. గవర్నర్ అరీఫ్ మహ్మద్ ఖాన్ సిఎం, మంత్రులతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తదితరులు హాజరయ్యారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అదరగొట్టింది. మొత్తం 243 అసెంబ్లీ సీట్లకు నితీశ్ కుమార్ నేతృత్వంలో ఎన్డీయే ఏకంగా 202 సీట్లు దక్కించుకుంది. బీజేపీ 101 సీట్లలో పోటీ చేసి 89 చోట్ల గెలుపొందింది. 101 సీట్లలోనే పోటీ చేసిన జేడీయూ 85 చోట్ల విజయం సాధించింది. తాజాగా ప్రమాణస్వీకారం చేసిన 27 మంత్రుల్లో.. 14 మంది బీజేపీ నుంచి కాగా, 9 మంది జేడేయూకు చెందిన నేతలు. బిహార్‌లో సీఎం నితీశ్ కుమార్ దాదాపు 19 ఏళ్లు పదవిలో ఉన్నారు. 2000 సంవత్సరంలో ఏడు రోజులు మాత్రమే సీఎంగా పని చేశారు. ఇప్పుడు ఎన్డీయే కూటమి మళ్లీ ఆయనకే పగ్గాలు అప్పగించడంతో పదోసారి సీఎంగా ప్రమాణం చేశారు. పదోసారి బిహార్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన నితీశ్ కుమార్‌కు ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. 'సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన నితీశ్ కుమార్‌కు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. నితీశ్ రాజకీయంలో ఎంతో అనుభవం ఉన్న నాయకుడు. రాష్ట్రంలో మంచి పాలన అందించిన వ్యక్తి అనే అద్భుతమైన రికార్డు ఆయనకు ఉందని ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు.

# తిరుపతి చేరుకున్న రాష్ట్రపతికి ఘనంగా స్వాగతం

**(మొదటి పేజీ తరువాయి)**

కొలువు తీరిన శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత అమ్మవారి తీర్థ ప్రసాదాలను రాష్ట్రపతికి వేద పండితులు అందజేశారు. ఇక రాష్ట్రపతి పర్యటన సందర్భంగా తిరుచానూరు లో పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. స్థానికుల రాకపోకలను నిలిపివేశారు. దాంతో స్థానికులు కొంత ఇబ్బంది పడ్డారు. ఇక తిరుచానూరు పర్యటన ముగించుకుని.. సాయంత్రం రోడ్డు మార్గం ద్వారా రాష్ట్రపతి తిరుమల చేరుకుంటారు. రాత్రికి పద్మావతి అతిథి గృహంలో ఆమె బస చేస్తారు. శుక్రవారం ఉదయం శ్రీవెంకటేశ్వర స్వామి వారిని రాష్ట్రపతి దర్శించుకోనున్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన నేపథ్యంలో తిరుమలలో సైతం పటిష్టమైన భద్రతాను ఏర్పాటు చేశారు. తిరుపతి పర్యటన ముగిసిన అనంతరం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లనున్నారు.

# సిబిఐ కోర్టుకు హాజరైన జగన్

**(మొదటి పేజీ తరువాయి)**

చేరుకున్నారు. విచారణ అనంతరం జగన్ అక్కడి నుంచి లోటస్‌పాండ్‌కు వెళ్లిపోయారు. మరోవైపు వైకాపా నేత పేర్ని నాని, మరో ముగ్గురు నేతలను కోర్టు లోపలికి పోలీసులు అనుమతించలేదు. దీంతో వారు గేట్ వద్దే నిలుచున్నారు. ఈ కేసులో 2013 సెప్టెంబర్ నుంచి జగన్ బెయిల్‌పై ఉన్నారు. ఇప్పుడు కూడా వ్యక్తిగత హాజరు నుంచి తనకు మినహాయింపు ఇవ్వాలని ఆయన కోరగా సీబీఐ తీవ్రంగా వ్యతిరేకించింది. ఆరేళ్లుగా జగన్ కోర్టుకు ప్రత్యక్షంగా హాజరవడం లేదని, ఈ కేసుల్లో డిశ్చార్జి పిటిషన్లపై రోజువారీ విచారణ జరుగుతున్నందున ప్రత్యక్షంగా హాజరవ్వాలని సీబీఐ తెలిపింది. దీంతో ఈ నెల 21లోగా వ్యక్తిగతంగా హాజరవ్వాలని కోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఒకరోజు ముందే ఆయన కోర్టుకు హాజరయ్యారు. అక్రమాస్తుల కేసులో వైకాపా అధ్యక్షుడు జగన్ సీబీఐ కోర్టుకు హాజరుకానున్న నేపథ్యంలో బేగంపేట ఎయిర్‌పోర్ట్ వద్ద వైకాపా కార్యకర్తలు హల్‌చల్ చేశారు. కొందరు రప్పా రప్పా అంటూ నినాదాలు చేశారు. ఎయిర్ పోర్టు లోపలికి చొచ్చుకెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారితో వాగ్వాదానికి దిగారు. మరోవైపు సీబీఐ కోర్టు వద్ద పెద్ద ఎత్తున పోలీసులు మోహరించారు.

# పెట్టుబడులకు హైదరాబాద్ వేదిక

**(మొదటి పేజీ తరువాయి)**

హాజరవుతారని గవర్నర్ కార్యాలయ కార్యదర్శి దాన కిశోర్ తెలిపారు. రెండు రాష్ట్రాల మధ్య సాంస్కృతిక వారసత్వం ఇచ్చి పుచ్చుకోవడానికే కాదు ఒకరి ఉత్పత్తులు మరొకరు అమ్మడానికి, కొనడానికి దోహదం చేస్తుందని త్రిపుర గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి అన్నారు. సంస్కృతి, సహజ వనరుల పరంగా ఈశాన్య రాష్ట్రాలు ఎంతో గొప్పవని.. మన దేశం అతిథి దేవో భవ అంటే వారు అభివృద్ధి దేవో భవ అంటున్నారని తెలిపారు. సంక్షేమ ఫలాలు అందరికీ చేరడమే అసలైన అభివృద్ధి అన్నారు. తొలి రోజు ఉత్తమ ప్రదర్శన కనబరిచిన కళాకారులకు గవర్నర్ బహుమతులు అందజేశారు. మిజోరాం యువజన సర్వీసులు, క్రీడల మంత్రిని సీఎం రేవంత్ రెడ్డి సన్మానించారు.

# దేశవ్యాప్తంగా సన్నబియ్యం పంపిణీ

**(మొదటి పేజీ తరువాయి)**

హోటల్ తాజ్‌కృష్ణలో కేంద్రమంత్రితో ముఖ్యమంత్రి రేవంత్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో సన్న బియ్యం పంపిణీ విషయాన్ని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలు తినే బియ్యాన్ని సరఫరా చేస్తేనే సంక్షేమ పథకం ఉద్దేశం నెరవేరుతుందని ముఖ్యమంత్రి అన్నారు. తెలంగాణలాగే కేంద్రం కూడా దేశవ్యాప్తంగా సన్న బియ్యం పంపిణీ అంశాన్ని పరిశీలించాలని కేంద్రమంత్రి కోరారు. అవసరమైతే అధ్యయనం చేసి తగు నిర్ణయం తీసుకోవాలని వినతి చేశారు. దీనిపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారు. పూర్తిస్థాయి అధ్యయనం తర్వాత పరిశీలించి దేశవ్యాప్తంగా సన్న బియ్యం పంపిణిపై నిర్ణయం తీసుకుంటామని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి వెల్లడించారు. ఈ సమావేశంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల రిజర్వేషన్లపై ప్రభుత్వానికి నివేదిక

**(మొదటి పేజీ తరువాయి)**

ముందుగా నిర్వహించకపోతే మార్చి నెలలో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే నిధులు ల్యాప్స్ అవుతాయని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తీసుకున్న రిజర్వేషన్ల ప్రకారమే 27 శాతం బీసీ రిజర్వేషన్లతో ముందుకు పోతామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ పరంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని తెలిపారు. భిక్కనూరు మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ఆవరణలో రూ.92.80 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు మంత్రి సీతక్క భూమిపూజ చేశారు. మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మహిళలను కోటీశ్వరులు చేయాలనే సంకల్పంతో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం వారికి రుణాలు మంజూరు చేస్తుందన్నారు. స్వయం ఉపాధితోపాటు వ్యాపార రంగంలో మహిళలు రాణించాలని.. ఇందుకోసం ప్రభుత్వం అన్ని రకాలుగా సహకారం అందిస్తోందన్నారు.

# పదవ తరగతి పేపర్ లీక్ కేసులో బండి సంజయ్ నిర్దోషిగా కోర్టు తేల్చిన నేపథ్యంలో బిజెపి శ్రేణుల సంబరాలు...







**కరీంనగర్,నవంబర్20(పీసీడబ్ల్యూ న్యూస్):** పదవ తరగతి పేపర్ లీక్ కేసులో కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ నిర్దోషిగా హై కోర్టు తేల్చిన నేపథ్యంలో గురువారం రాత్రి కరీంనగర్ బిజెపి శ్రేణులు స్థానిక తెలంగాణ చౌక్లో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా టపాసులు పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ ప్రోగ్రాంలో పాల్గొన్న బిజెపి నేతలు మాజీ మేయర్ సునీల్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుగ్గిల్లపు రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం తప్పుడు కేసులతో బండి సంజయ్ కుమార్ ను అనేక ఇబ్బందులు పట్టే ప్రయత్నం చేసిందన్నారు. కెసిఆర్ నియంతృత్వ వ్యతిరేక విధానాలను బండి సంజయ్ కుమార్ ప్రజా క్షేత్రంలో ఎండగడితే జీర్ణించుకోలేని స్థితిలో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక తప్పుడు కేసులు పెట్టిందని తెలిపారు. అందులో పదోతరగతి పేపర్ లీక్ కేసు కూడా ఒకటని , 2023 పదవ తరగతి పేపర్ లీక్ చేసినట్టు బండి సంజయ్ కుమార్ ను నాడు కెసిఆర్ ప్రభుత్వం అక్రమ కేసు పెట్టి అరెస్టు చేసి జైలుకు తరలించి శునకానందం పొందిందన్నారు. నాడు అక్రమంగా బండి సంజయ్ మీద పెట్టిన కేసును కొట్టివేస్తూ తెలంగాణ హైకోర్టు నేడు తీర్పు ఇవ్వడం హర్షనీయమన్నారు. ప్రజల తరపున పోరాటం చేసినందుకు కక్షపూరితంగా బండి సంజయ్ పై కేసు పెట్టిన నాటి టిఆర్ఎస్ సర్కారుకు హైకోర్టు తీర్పు చెంపపెట్టు లాంటి తీర్పునిచ్చిందన్నారు. ప్రజల కోసం పోరాటం చేసే బండి సంజయ్ లాంటి నాయకులను అణిచివేయాలని ప్రయత్నించిన బిఆర్ఎస్ కు ప్రజలే తగిన గుణపాఠం చెప్పారని, ఆ పార్టీ పని అయిపోయిందని, ఆ పార్టీని ఎవరు విశ్వసించడం లేదన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి మీడియా కన్వీనర్ కటకం లోకేష్ , ఎండి ముజీబ్, రాపర్తి ప్రసాద్, కోలగని శ్రీనివాస్, వంగల పవన్, బండ రమణా రెడ్డి, లెక్కల వేణుగోపాల్, కరీంనగర్ జోన్ అధ్యక్షులు బండారు గాయత్రి, అవదుర్తి శ్రీనివాస్, తణుకు సాయి,పార్వజ్, జాడి బాల్ రెడ్డి, నాగసముద్రం ప్రవీణ్,ఉప్పరపల్లి శ్రీనివాస్, సురేష్, సంపత్, రాజు, వరాల జ్యోతి, మాసం గణేష్, మాడిశెట్టి సంతోష్, సమీ వివిధ మోర్చాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ములుగు జిల్లాలో సిపిఐ పార్టీ బస్సు జాత

## కగార్ ఎన్ కౌంటర్‌లపై న్యాయ విచారణ జరపాలి

## సుప్రీం కోర్టు సుమోటోగా స్వీకరించాలి

## మావోయిస్టులు కూడా పంథా మార్చుకోవాలి

## సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు






**ములుగు జిల్లా నవంబర్ 20 (పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా కేంద్రంలో సిపిఐ పార్టీ బస్సు జాత కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా తక్కలపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ కగార్ ఆపరేషన్ పేరుతో కేంద్ర ప్రభుత్వం జరుపుతున్న మావోయిస్టుల ఎన్ కౌంటర్ లన్నింటిపైనా న్యాయ విచారణ జరిపించాలని సీపీఐ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు గురువారం ములుగు జిల్లాలోకి ప్రవేశించిన సిపిఐ బస్సు జాత ప్రవేశించిన సందర్భంగా జరిగిన సభ ములుగు జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్ అధ్యక్షతన జరిగిన సభలు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేని శంకర్ తో కలిసి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడారు కగార్ ఎన్ కౌంటర్ లపై అనేక అనుమానాలు ఉన్నాయని మావోయిస్టుల ఎన్ కౌంటర్ లను స్వయంగా సుప్రీం కోర్టు సుమోటోగా స్వీకరించి విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు మావోయిస్టులను కోర్టుకు సరెండర్ చేయకుండా టెర్రరిస్టుల మాదిరిగా కేంద్ర ప్రభుత్వం బావించడం సరికాదని అన్నారు అలాగే మావోయిస్టులు కూడా పునరాలోచన చేయాలని తమ పంథాను మార్చుకోవాలని కోరారు తుపాకీ గొట్టం ద్వారా రాజ్యాధికారం సాధ్యం కాదని ఇప్పటికే కొందరు బయటికి వచ్చారని మిగిలిన వారు కూడా తమ పంథాను మార్చుకొని కమ్యూనిస్టులతో కలిసి రావాలని కోరారు దేశంలో బీజేపీ ప్రభుత్వం నరహంతక పాలన సాగిస్తున్నదని కేవలం కార్పొరేట్ పెట్టుబడిదారీ శక్తుల కోసమే పని చేస్తున్నదని అన్నారు ఇటీవల ప్రభుత్వ రంగ సంస్థ ఎల్ఐసీకి చెందిన రూ 33వేల కోట్లను ఆదానీ గ్రూపులో పెట్టుబడి పెట్టడమే ఇందుకు నిదర్శనం అన్నారు ప్రజలు సంక్షేమాన్ని విస్మరించి పాలన చేస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా పోరాడేందుకు వామపక్ష ప్రజాతంత్ర శక్తులు బల పడాలని అన్నారు అందుకోసం కమ్యూనిస్టులతో మావోయిస్టులు కూడా కలిసి రావాలని కోరారు రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లపై కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చేందుకు అఖిలపక్ష పార్టీలను ముఖ్యమంత్రి డిల్లీకి తీసుకెళ్లాలని సూచించారు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి బండి సంజయ్ ఇందుకు బాధ్యత వహించాలని కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ మాట్లాడుతూ వచ్చే డిసెంబర్ 26 నాటికి సీపీఐ ఆవిర్భవించి వందేళ్లు పూర్తి అవుతున్న సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా సీపీఐ బస్సు జాతాలను నిర్వహిస్తున్నదని చెప్పారు డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే వందేళ్ల సభకు వేలాదిగా తరలి రావాలని ప్రజలను కోరారు గడిచిన వందేళ్ల కాలంలో సీపీఐ అనేక పోరాటాలు నిర్వహించిందని దున్నువాడికి భూమి కావాలని కార్మిక రైతాంగ దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిందని చెప్పారు మారిన కాలంలో బూర్జువా పార్టీలు నోట్లతో ఓట్లు కొనుగోలు చేస్తూ గద్దె నెక్కుతున్నాయని ఓట్లు సీట్లతో సంబంధం లేకుండా సీపీఐ చట్ట సభలలో బయటా తన గొంతు వినిపిస్తూ పేదల పక్షాన నిలిచిందని అన్నారు రానున్న రోజులలో ఎర్ర జెండా పార్టీలన్నీ ఏకమై ఈ బూర్జువా అట్కపార్టీలకు వ్యతిరేకంగా నిలబడాలని అందుకు ప్రజలంతా కమ్యూనిస్టులతో కలిసి నడువాలన ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు సిపిఐ జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జునరావు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి అంజాద్ పాషా సిపిఐ ములుగు మండల కార్యదర్శి ముత్యాల రాజు వెంకటాపూర్ గోవిందరావుపేట్ తాడువాయి మండలాల కార్యదర్శులు బండి నరసయ్య వాడి సారయ్య బండారి శ్రీనివాస్ నాయకులు బోడ రమేష్ గుంజ శ్రీనివాస్ మంకిడి కృష్ణ నటరాజ్ తోట సంపత్ మహేందర్ తిరుపతి సామల రామా పోరెడ్డి ప్రమీల లింగమూర్తి కుమ్మరి సాగర్ రాజకుమార్ రాంజీ రాజకుమారి కమలక్క లక్ష్మి రాధా 500 మంది కార్మికులు పాల్గొన్నారు.

# పిల్లల్లో పుస్తక పఠన ఆసక్తిని నెలకొల్పాలి

## జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి ఏం.ఏ గౌస్ పాషా

## గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న డిపిఆర్ఓ









**ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 20 (పిసిడబ్ల్యూ న్యూస్) :** పిల్లల్లో పుస్తక పఠన ఆసక్తిని నెలకొల్పాలని డిపిఆర్ఓ ఎం.ఏ. గౌస్ అన్నారు.డిపిఆర్ఓ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం జరిగిన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో డిపిఆర్ఓ ఎం.ఏ. గౌస్ పాల్గొని మాట్లాడుతూ.. పుస్తకాలు చదవడం వల్ల జ్ఞానంతో పాటు మంచి వ్యక్తిత్వం పెరుగుతుందని అన్నారు. చిన్నతనం నుంచే పిల్లల్లో పుస్తక పఠనం అలవాటు పెంచాలని అన్నారు. పుస్తకాలు జ్ఞాన ధనాగారాలని, పుస్తకాలు లభించే గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. గ్రంథాలయంలో ఉద్యోగార్డులకు అవసరమైన అన్ని పుస్తకాలు ఏర్పాటు చేశామని, అందుబాటులో ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ, లక్ష్య సాధన దిశగా కృషిచేయాలని విద్యార్థులకు సూచించారు. పుస్తకాలు మనసుకు దివిటీలని, భవిష్యత్ తరాలు జ్ఞానం వైపు నడవాలంటే ప్రతి గ్రామంలో, ప్రతి పట్టణంలో గ్రంథాలయాలు చైతన్య కేంద్రాలుగా నిలవాలని డిపిఆర్వో తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థినీ, విద్యార్థులకు ఈ సందర్భంగా బహుమతుల ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కటుకోజ్వల రమేష్ రచించిన మరో గ్రంథాలయ ఉద్యమం కవితను డిపిఆర్వో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె. కరుణకుమారి, గ్రంథాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కెవిఎస్ఎల్ఎన్. రాజు, కార్యదర్శి ఎం.డి. ఇమామ్, ఉద్యోగులు జె. భాస్కర్, సిహెచ్. శ్రీనివాస్, వి. అఖిల్, ఎం. రోహిత్, ఎస్. లలితకుమారి, కె. విజయకుమారి, బి. నాగలక్ష్మి, ఎం. సుమలత, కె. రవిబాబు, బి. బాబు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సత్యసాయి జయంతి వేడుకలకు తప్పకరండి...

- మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాద్ కేకన్‌కు ఆహ్వానం..
- సత్యసాయి సేవాసమితి కన్వీనర్ సిహెచ్ శ్రీనివాస్



**మహబూబాబాద్ జిల్లా కురవి నవంబర్ 20(పి.సి.డబ్ల్యూ న్యూస్):** మండలకేంద్రంలో ఈనెల 23వ తేదీన ఘనంగా నిర్వహించనున్న భగవాన్ శ్రీ సత్యసాయిబాబా వారి శతజయంతి వేడుకలకు హాజరుకావాలని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాద్ కేకన్ ను శ్రీ సత్యసాయి సేవాసమితి కన్వీనర్ సిహెచ్ శ్రీనివాస్ కోరారు.మహబూబాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ సుధీర్ రాంనాద్ కేకన్ ను కలిసి భగవాన్ శ్రీ సత్యసాయిబాబా వారి చిత్రపటాన్ని, ఆహ్వానపత్రికను అందజేశారు. ఉదయం 5 గంటలకు నగరసంకీర్తనతో స్వామి వారి జయంతి వేడుకలు ప్రారంభం అవుతాయని, ఏడు గంటలకు రుద్రాభిషేకం, మంగళహారతి కార్యక్రమాలు ఉంటాయని కన్వీనర్ సిహెచ్ శ్రీనివాస్ తెలిపారు. సాయంత్రం 4గంటలకు శతవర్షమహోత్స రథయాత్ర ప్రారంభం అవుతుందని, కురవి పురవీధులలో శోభాయాత్ర నిర్వహించి ఏడుగంటలకు ప్రశాంతనిలయం చేరుకుని కేక్ కటింగ్, మంగళహారతి, పవలింపుసేవ నిర్వహించడంతో జన్మదిన వేడుకలు ముగుస్తాయని ఎస్పీ సుధీర్ రాంనాద్ కేకన్ కు తెలిపారు. తప్పనిసరిగా హాజరై బాబా వారి ఆశీస్సులు స్వీకరించాలని శ్రీ సత్యసాయి సేవాసమితి కన్వీనర్ సిహెచ్ శ్రీనివాస్ ఎస్పీ సుధీర్ రాంనాద్ కేకన్ ను మర్యాదపూర్వకంగా కోరారు. ఈ కార్యక్రమంలో సేవాసమితి బాద్యులు గండేపల్లి తిరుమలరావు తో పాటు సీనియర్ జర్నలిస్ట్ చీకటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# కస్తాల సత్యనారాయణ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్ర



**ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 20 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కస్తాల సత్యనారాయణ తల్లి ఇటీవల అనారోగ్యంతో మరణించారు. గురువారం కస్తాల సత్యనారాయణ కుటుంబాన్ని ఎమ్మెల్సీ, ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తాతా మధుసూదన్, మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య లు పరామర్శించి సత్యనారాయణ తల్లి గారి చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముత్యాల వెంకటప్పారావు, చుంచు విజయ్ కుమార్, దొండేటి అశ్వినీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నాసా ప్రాజెక్టుల్లో ప్రతిభ కనబరిచిన రామంతాపూర్ శ్రీచైతన్య విద్యార్థులు





**ఉప్పల్ నవంబర్ 20(పిసిడబ్ల్యూ న్యూస్):** రామంతాపూర్ శ్రీ చైతన్య పాఠశాలలో నాసా నిర్వహించే ప్రాజెక్టు పోటీలలో ప్రతిభ గనబరిచిన విద్యార్థులకు ఏ.జి.యం. మోఘుల్ నూర్ మహమ్మద్ అలీ కిట్స్ను అందజేస్తూ అభినందించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచి నాసా ప్రాజెక్టులలో పాల్గొనడం వల్ల విద్యార్థులకు విజ్ఞానం ప్రపంచ స్థాయి గుర్తింపు పొందవచ్చని, ప్రయోగాలు, పరిశోధనలు చేయడం వంటి నైపుణ్యాలు విద్యార్థులలో అభివృద్ధి చెందుతుందని అన్నారు.ముఖ్య అతిథి ప్రిన్సిపల్ సైంటిస్ట్ సైంటిస్ట్ I.I.C.T. యం.శ్రీలత నాసా కిట్స్ ను అందజేస్తు భవిష్యత్తులో ఇంజనీరింగ్, స్పేస్, సైన్స్, సాఫ్ట్ వేర్, రీసెర్చ్ వంటి రంగాల్లో కేరీర్ కి ఇది మంచి పునాది అవుతుందని చెబుతూ, ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భాగ్యలక్ష్మి మాట్లాడుతూ చిన్నప్పటి నుంచే పెద్ద ప్రాజెక్టుల్లో భాగమవడం వల్ల విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం పెరుగుతుందని, పెద్ద లక్ష్యాలను పెట్టు కోవడానికి ప్రేరణ లభిస్తుందని అన్నారు.వైస్ ప్రిన్సిపల్ శ్రీ కీర్తి కోన మాట్లాడుతూ స్పేస్కు సంబంధించిన రియల్ టైమ్ సమస్యలను అర్థం చేసుకొని వాటికి పరిష్కారాలు కనుగొనే సామర్థ్యం పెరుగుతుందని అన్నారు. పాఠశాల డీన్ నాగరాజు మాట్లాడుతూ భవిష్యత్తులో ఇదే ఆసక్తి తో తరువాత అంతరిక్ష పరిశోధనలకు, నూతన ఆవిష్కరణలకు మార్గం సుగుమం అవుతుందన్నారు.భాగంగా జోన్ ఆర్.ఐ. మల్లి ఖార్జున నాయుడు, జోన్ కో–ఆర్డినేటర్ రాజేంద్రప్రసాద్, ఐ.పి.యల్, సి బ్యాచ్ ఇంచార్జులు వెంకటేష్ గుప్తా, అరుణ్ కుమార్, నాసాఇంచార్జులు రమా శ్రీనివాస్, ఉపేందర్ చారి మరియు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రేమ్ నగర్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమావాస్య అన్న ప్రసాద వితరణ కార్యక్రమం



**అంబర్ పేట్ నవంబర్ 20 (పిసిడబ్ల్యూ న్యూస్):** అంబర్ పేట్ డివిజన్ ప్రేమ్ నగర్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమావాస్య అన్నప్రసాద వితరణ కార్యక్రమము నిర్వ హించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం కమిటీ చైర్మన్ జిల్లా హరిబాబు గుప్త మాట్లాడుతూ ప్రేమనగర్ ఆర్య సంఘం ఆధ్వర్యంలో ప్రతి అమావాస్య రోజున అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్ని దానాల కంటే అన్నదానం గొప్పదని ఈ సందర్భంగా అన్నారు. ఈ అమావాస్య అన్న ప్రసాద వితరణ చేయించినవారు జూలూరి తిరుపతి గుప్త రజిని, గుద్దేటి శరణయ్య గుప్తా హైమావతి, చికోటి అంజయ్య గుప్తా అనసూయ,ఆరూరు రాజేందర్ ప్రసాద్ గుప్తా భవాని , అధ్యక్షులు జిల్లా రవీందర్ గుప్తా, ప్రధాన కార్యదర్శి అంజయ్య,కోశాధికారి ఆకుల రమేష్ గుప్తా, కోచ్ చైర్మన్ నేటి శ్రీనివాస్ గుద్దేటి శరణయ్య, బొడ్డు వెంకటేష్, మహంకాళి సత్యనారాయణ గుప్తా ఓరుగంటి అంజయ్య గుప్తా, కొండూరు ప్రభాకర్, మరియు సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల పథకంలో లంచాల పర్వం

• రేగళ్ళపాడు సెక్రటరీ సస్పెండ్



**సత్తుపల్లి, నవంబర్ 20 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పేదల కొరకు చేపట్టిన ఇందిరమ్మ ఇల్లు పథకం కొంతమంది అధికారుల వల్ల అభాసుపాలు అవుతుంది. ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల నుండి లంచం తీసుకున్న రేగళ్ళపాడు పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్ కావడం ఇందుకు ఒక కారణమయ్యింది. ఖమ్మం జిల్లా, సత్తుపల్లి మండలం, రేగళ్లపాడు గ్రామపంచాయతీలోని లబ్ధిదారులు టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేసి రేగళ్లపాడు గ్రామపంచాయతీ సెక్రటరీ శివ మాధవరావుపై ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులుగా తమ వద్ద డబ్బులు వసూలు చేశారని ఫిర్యాదు చేయడం జరిగింది. దీనిపై వెంటనే స్పందించిన హౌసింగ్ ఎండి వీపీ గౌతమ్ విచారణ అధికారిగా పీడీ శ్రీనివాస్ ను నియమించి పూర్తిస్థాయి విచారణ జరిపి నివేదిక అందిన వెంటనే జిల్లా కలెక్టర్ కు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. హౌసింగ్ ఎండి ఆదేశాలు అందిన వెంటనే ఖమ్మం జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ బుధవారం సాయంత్రం రేగళ్లపాడు గ్రామపంచాయతీ సెక్రటరీ శివ మాధవరావును సస్పెండ్ చేయడం జరిగింది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇల్లు పథకంను దుర్వినియోగానికి పాల్పడితే చర్యలు తప్పవని జిల్లా అధికారులు హెచ్చరించారు.

## జిఎల్ఎస్ డెంటల్ క్లినిక్ డాక్టర్ శేషు కుమార్‌పై కేసు నమోదు



**హన్మకొండ,నవంబర్20(పీసీడబ్ల్యూ న్యూస్):** హనుమకొండ పట్టణంలోని కాకాజి కాలనీలో డాక్టర్ శేషు కుమార్ జి ఎల్ ఎస్ డెంటల్ మరియు ఇంప్లాంట్ సెంటర్ ని గత కొన్ని సంవత్సరాలుగా నడుపుతున్నాడు సదర్ దంత వైద్యుడు తనకు యం డి యస్ డిగ్రీ లేక పోయినను పత్రికా ముఖంగా ప్రచురణాలు ఇస్తూ గత కొద్ది కాలంగా నగర ప్రజలను మోసం చేస్తున్నాడని, ఇండియన్ డెంటల్ అసోసియేషన్ వరంగల్ అధికారులు రాష్ట్ర దంత వైద్య మండలి, హనుమకొండ కలెక్టర్ మరియు జిల్లా వైద్యాధికారికి ఫిర్యాదు చేయగా, రాష్ట్ర దంత మండలి మరియు జిల్లా వైద్యాధికారి ప్రాథమిక విచారణ జరిపి సదరు డాక్టర్ శేషు కుమార్ ఎటువంటి ఎం డీ ఎస్ డిగ్రీ పట్టా లేకుండా వైద్యం చేస్తు ప్రజలను మోసం చేస్తున్నట్టు నిర్ధారించి సదరు డాక్టర్ పై చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి హనుమకొండ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు ఇవ్వగా ఇన్స్పెక్టర్ మచ్చ శివకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## సీతారావమ్మకు ఘన నివాళులు

- కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్



**వేంసూరు ,నవంబర్ 20 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు కారుమంచి సీతారావమ్మకు కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ ఘన నివాళు లర్పించారు.మండల పరిధిలో కోండగట్ల గ్రామానికి చెందిన కారుమంచి సత్యనారాయణ, వెంకటేశ్వరరావు మాతృమూర్తి సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు కారుమంచి సీతారావమ్మ మరణించగా వారి పార్థివాదేహానికి పూలమాల వేసి నివాళు లర్పించి,వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసినారు. వేంసూరు మండల కాంగ్రెస్ నాయకులు, గ్రామ కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన సుడా చైర్మన్...





**కరీంనగర్,నవంబర్20(పీసీడబ్ల్యూ న్యూస్):** వివిధ అనారోగ్య కారణాలతో ఆసుపత్రులలో చికిత్స పొంది అర్హత గల వారిని ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆదుకుంటున్నామని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు.నగర కాంగ్రెస్ కార్యాలయంలో 18 మందికి మొత్తం కలిపి 6 లక్షల 70 వేల రూపాయల చెక్కులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ కరీంనగర్ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఇప్పటి వరకు 846 మందిని నగర కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ ద్వారా ఆదుకున్నామని కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలన్నదే మా కోరిక అని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు.లబ్ది దారులు జుట్టు లక్ష్మీనారాయణ,దారం స్రవంతి,దర్యపల్లి వాణి,పురుమల్ల శ్రీలత,ముజీబున్నీసా బేగం, యాసమీన్ ఫాదౌస్,గుర్రం సురేష్, యెన్నం మహిపాల్,సైద్ సుమర్,మహంకాళి ప్రసాద్,అహ్మద్ అలీ,భూలక్ష్మి,రాజేంద్ర ప్రసాద్, మాచర్ల శేఖర్,సుతారి మల్లేశం, సయ్యద్ మస్తాన్,గుంటి మల్లయ్య,కిష్టయ్య లకు చెక్కులు అందజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు

• కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్





**కల్లూరు, నవంబర్ 20 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రతి పేదవాడికి ఇంద్రం ఇల్లు ఇవ్వడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ గురువారం మండలంలో పలు గ్రామాల్లో విస్తృత పర్యటన చేపట్టారు. తూర్పు లోకారం గ్రామం లో ఇందిరమ్మ ఇల్లు పైలెట్ ప్రాజెక్టు నిర్మాణంలు జరుగుతున్న పనులను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడినారు. పుల్లయ్య బంజర్ గ్రామములో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంను పరిశీలించి రైతులతో కూలీలతో మాట్లాడారు. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న ప్రభుత్వ పథకాలు గురించి వివరించారు. తూర్పు లోకారం గ్రామం లో అంగన్వాడీ కేంద్రమును పరిశీలించి విషయాలు అడిగి తెలుసుకున్నారు. పుల్లయ్య బంజర గ్రామంలో కార్తీకమాసం సందర్భంగా భక్తులతో కలిసి శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మహా అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు పసుమర్తి చందర్ రావు, మాజీ ఎంపీటీసీ అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి, తక్కెళ్ళ దుర్గాప్రసాద్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఆళ్లకుంట నరసింహ రావు, శివాలయం చైర్మన్ మాడిశెట్టి వెంకటేష్, నోటి కృష్ణారెడ్డి, ఉబ్బన రాంబాబు, సుబ్బారావు, నరసింహారావు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వేంసూరులో రెచ్చిపోతున్న మట్టి మాఫియా...?

• నన్నాపేదెవరు అంటున్నా అక్రమ దారులు..?

• పట్టించుకోని మైనింగ్, ఇతర శాఖల అధికారులు



**సత్తుపల్లి, నవంబర్ 20 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మం జిల్లా, వేంసూరు మండలంలోని ఎర్రగుంట పాడు గ్రామం అక్రమ మట్టిదందాతో అల్లకల్లోలమవుతోంది. తమ సొంత స్థలంలో లేదా వ్యవసాయ భూమిలో మట్టి త్రవ్వుకోవడానికి సైతం సదరు యజమానులు ప్రభుత్వ అధికారుల అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. అలాంటిది ఎవరి మామూళ్లు వాళ్ళకి ఇచ్చాం మమ్మల్ని ఎవరు అడ్డుకుంటారు?" అన్నట్టు మట్టి మాఫియా రెచ్చిపోతూ మూడు పువ్వులు ఆరు కాయలుగా, రాజకీయ నాయకుల పరిరక్షణతో రోజూ రాత్రింబగళ్లూ విపరీత శబ్దాలతో మట్టి టిప్పర్లు గ్రామ రహదారులపై అడ్డూ అదుపు లేకుండా తిరుగుతున్నాయి. గ్రామ పరిసరాల్లో గుట్టలు కరిగిపోయేంతగా మట్టి తవ్వకాలు సాగుతున్నా.. సహజ వనరులు ధ్వంసం ఔతున్నా మైనింగ్, రెవెన్యూ, పోలీసులు సహా సంబంధిత శాఖలు మాత్రం కనిపించకుండా పోయాయి. అధికారుల నిర్లక్ష్యం మట్టి మాఫియాకు మరింత బలం చేకూర్చింది. ఈ అక్రమాల ద్వారా కొందరు వ్యక్తులు లక్షలాది రూపాయలు సంపాదిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ అధికారుల నుండి ఎటువంటి అనుమతులు లేకుండా నిరంతరం తిరుగుతున్న అక్రమ మట్టి టిప్పర్ల వలన గ్రామ రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. పంటపొలాలకు వెళ్లే రైతులు ప్రతిరోజూ ఇబ్బందులు పడుతున్నారు. చిన్న వాహనాలు, ఆటోలు సైతం వెళ్లలేని దుస్థితి ఏర్పడిందని వారు బహిరంగంగానే చర్చించుకుం టున్నారు. మట్టి టిప్పర్లు దూసుకుపోతుంటే.. ప్రజల సమస్యలు ఎవరి దృష్టికి రావు అని గ్రామస్తుల వేదన. తక్షణమే అధికార యంత్రాంగం మొద్దు నిద్ర వీడి అక్రమ మట్టిదందాను అరికట్టాలని, గ్రామ రహదారులను పునరుద్ధరించాలని ఎర్రగుంటపాడు గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## వీరాపూర్‌లో అట్టహాసంగా గృహప్రవేశాలు...









**బెజ్జంకి,నవంబర్20(పీసీడబ్ల్యూ న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇంటి పథకం కింద ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులు గురువారం అట్టహాసంగా గృహ ప్రవేశాలు చేశారు. ఈ కార్యక్రమాలకు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇంటి పథకం కింద వీరాపూర్ ను పైలట్ గ్రామంగా ఎంపిక చేశామని, అందులో భాగంగానే సొంత ఇల్లు లేని నిరుపేదలకు వందశాతం గృహాలు మంజూరు చేశామన్నారు. ప్రస్తుతం నలుగురు లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి గృహప్రవేశాలు చేసుకోవడం సంతోషకరమని ఆయన పేర్కొన్నారు. గృహప్రవేశాలు చేసుకున్న లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు ఆయన శు భాకాంక్షలు తెలిపారు. నూతన గృహాల్లో సుఖశాంతులతో ఆనందకరమైన జీవితం గడపాలని, అన్ని శుభాలే చేకూరలని ఎమ్మెల్యే అభిలషించారు.**సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ** బెజ్జంకి మండలానికి 21విడుతలో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పంపిణీ చేశారు. గురువారం వీరాపూర్ గ్రామాలను లబ్ధిదారులకు ఆయన అందజేశారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ రెడ్డి,పార్టీ నాయకులు బైర సంతోష్, పులి సంతోష్, గూడెల్లి శ్రీకాంత్, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మ నగర్‌లోని శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయ ప్రతిష్ట మహోత్సవాలు నేటి నుంచి...







**తిమ్మాపూర్,నవంబర్20(పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్ లో (ఎల్ ఎం డి) నూతనంగా నిర్మించిన శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయ ప్రతిష్ట మహోత్సవ వేడుకలు శుక్రవారం నుండి ప్రారంభమవుతాయని దేవాలయ కమిటీ నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలియజేశారు. నవంబర్ 21, 22 23 వ తేదీ ల్లో దేవాలయ ప్రతిష్టా మహోత్సవ వేడుకలు, పూజ కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. దేవాలయ స్థాపనలో భాగంగా శ్రీ శ్రీ హరి హర పుత్ర ధర్మ శాస్తా (అయ్యప్పస్వామి), గణపతి, సుబ్రహ్మణ్య, నాగేంద్ర, పార్వతీదేవి, నవగ్రహ దేవత విగ్రహాల ప్రతిష్ట లతోపాటు శిఖరధ్వజ, మహాకుంభాభిషేక మహోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించడానికి తగిన ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. శ్రీ శ్రీ శ్రీ జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతులు శ్రీ శ్రీ విద్యారణ్య భారతి స్వామి కరకమలములతో యంత్ర ప్రతిష్ట, ప్రాణ ప్రతిష్ట, మహా కుంభాభిషేక కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు. ప్రతిష్టాపన మహోత్సవ వేడుకలకు హాజరయ్యే సమస్త భక్తులు, అయ్యప్ప స్వాములకు ఏలాంటి అసౌకర్యం, ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల చర్యలు, జాగ్రత్తలు చేపట్టినట్లు దేవాలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ప్రతిరోజు అన్నప్రసాద వితరణ ఉంటుందని చెప్పారు. హిందూ బంధువులు, అయ్యప్ప భక్తులు ప్రతి ఒక్కరూ ఇట్టి దేవాలయ ప్రతిష్టాపన మహోత్సవ వేడుకల్లో పాల్గొని, శ్రీఅయ్యప్ప స్వామి కృపకు పాత్రులు కాగలరని ఆలయ నిర్వాహకులు కోరారు.

## డ్రగ్స్ రహిత సమాజమే మనందరి లక్ష్యం

• వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



**హన్మకొండ,నవంబర్20(పీసీడబ్ల్యూ న్యూస్):** డ్రగ్స్ రహిత సమాజమే మనందరి లక్ష్యమని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మత్తు పదార్థాల నియంత్రణకై చేపట్టిన చర్యల్లో భాగంగా, మత్తు పదార్థాల వినియోగించే వారితో పాటు, వీటిని విక్రయాలకు పాల్పడే వారిని గుర్తించేందుకు, అలాగే యువత మత్తు పదార్థాలకు దూరంగా వుండాలని తెలిపే విధంగా డ్రగ్స్ కంట్రోల్ టీం అధ్వర్యంలో సే నో టు డ్రగ్స్ నినాదంతో రూపొందించిన ప్రచార గోడ పత్రికలను వరంగల్ పోలీస్ కమిషనర్ గురువారం అధికారులతో కలసి కమిషనరేట్ కార్యాలయం లో అవిష్కరించారు. అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగంతో యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, యువత భవితవ్యాన్ని కాపాడు కోవడం మనందరి ప్రధాన కర్తవ్యమని, మత్తు పదార్థాల నియంత్రణలో ప్రజలు సైతం పరోక్షంగా తమ వంతు సహకారాన్ని అందించాల్సి వుంటుందని ఇందుకోసం ఎవరైన మత్తు పదార్థాల విక్రయాలు, వినియోగాలకు పాల్పడితే తక్షణమే 8712584473, 8712685299 నంబర్లకు సమచారం అందించి డ్రగ్స్ రహిత సమాజం కై మీరు భాగస్వాములు కావాలని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా వుంచబడుతాయని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలియజేసారు. ఈ కార్యక్రమములో పరిపాలన విభాగం అదనపు డిపిపి రవి, స్పెషల్ బ్రాంచ్ ఏసిపి జితేందర్ రెడ్డి, ఆర్.ఐ శివకేశవులు, ఇన్స్‌స్పెక్టర్ సతీష్, ఆర్.ఎస్.ఐలు పూర్ణచందర్ రెడ్డి, మనోజ్ రెడ్డి,నాగరాజు, ర్యాపిడో సంస్థ ప్రతినిధులు దర్గారావు, సందీప్ పాల్గోన్నారు.

# మొక్కజొన్న వేసే రైతులకు అగ్రిమెంట్లు చేయించాలి



**కల్లూరు ,నవంబర్ 20 (పిసిడబ్ల్యూ న్యూస్) :** పట్టణంలో సిపిఎం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మొక్కజొన్న వేసిన రైతులకు కంపెనీల నుంచి వెంటనే అగ్రిమెంట్ చేయించాలని సిపిఎం పార్టీ సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం అధిక వర్షాల వల్ల పత్తి పంటలు దెబ్బతినడంతో రైతులందరూ తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. దీంతో రైతులందరూ మొక్కజొన్న వైపు మొగ్గు చూపడంతో కార్పొరేట్ కంపెనీలు ముందుకు వచ్చి రైతులను మోసం చేసేందుకు సిద్ధంగా ఉన్నారని ఆరోపించారు. కార్పొరేట్ కంపెనీలు రైతులతో అగ్రిమెంట్ చేయకుండా మొక్కజొన్న విత్తనాలను రైతులు సాగు చేస్తున్నారు. కాబట్టి రైతు నష్టపోకుండా వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు, కంపెనీలతో అగ్రిమెంట్ చేయించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయంలో వ్యవసాయ శాఖ అధికారులు తెలిసి కూడా తెలియనట్లు వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. అగ్రిమెంట్ చేయమని అడిగితే రైతు రైతులకు విత్తనాలు ఇవ్వలేదని ఆయన అన్నారు.కల్లూరు మండలం లో ఇప్పటికే అగ్రిమెంట్ లేకుండా సుమారు 2 వందల ఎకరాలు మొక్కజొన్న వేశారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే మొక్కజొన్న వేసే రైతులకు రాసి, బేయర్ కంపెనీలతో అగ్రిమెంట్లను రాపిచ్చి గిట్టుబాటు ధర కల్పించి రైతులుకు నష్టం కలగకుండా చూసే బాధ్యత తీసుకోవాలని అన్నారు. భారతదేశంలో వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులు కమ్ముకున్నా యని ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలు వలన కార్పొరేట్ శక్తులు అన్నీ ముందుకు వచ్చాయని రైతులను నట్టేట ముచ్చుతున్నాయని ఆరోపించారు. రైతులకు అగ్రిమెంట్ చేసే బాధ్యత కలిగి ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకోవాలని లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమంలు చేపడతామని హెచ్చరించారు.

# నిబంధనలు పాటించే రైస్ మిల్లర్లకే ధాన్యం కేటాయింపు

- ధాన్యం కొనుగోలుపై రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించిన అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి






**ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 20 (పిసిడబ్ల్యూ న్యూస్) :** నిబంధనలు పాటించే రైస్ మిల్లర్లకే ధాన్యం కేటాయించడం జరుగుతుందని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి అన్నారు. అదనపు కలెక్టర్, కలెక్టరేట్ సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోలుపై రైస్ మిల్లర్లు, సంబంధిత అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ ధాన్యం కొనుగోలు ప్రక్రియ ఆశించిన స్థాయిలో సజావుగా జరగడం లేదని తెలిపారు. జిల్లాలో ఉన్న 71 రైస్ మిల్లుల్లో ఇప్పటి వరకు 63 రైస్ మిల్లర్లు మాత్రమే బ్యాంకు గ్యారంటీ లు సమర్పించారని, మిగిలిన 8 మిల్లులకు ఎట్టి పరిస్థితులలో ధాన్యం కేటాయింపులు జరగవని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. 8 మిల్లులు గతంలో పెండింగ్ ఉన్న రైస్ డెలివరీ పూర్తి చేసి, బ్యాంక్ గ్యారంటీలు సమర్పిస్తే ఖరీఫ్ సీజన్ ధాన్యం కేటాయింపుపై నిర్ణయం తీసుకుంటామని అన్నారు. 10 శాతం బ్యాంకు గ్యారంటీ, పెండింగ్ యాసంగి రైస్ డెలివరీ పూర్తి చేయని పక్షంలో రైస్ మిల్లులకు గోడౌన్ ట్యాగ్ చేయడం జరగదని అన్నారు. ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ ధాన్యం తీసుకున్న ప్రతి రైస్ మిల్లర్ తప్పనిసరిగా యాసంగి కేటాయింపు తీసుకోవాల్సి ఉంటుందని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి సీజన్ లో 2 నుంచి 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రైస్ మిల్లర్లకు కేటాయించాల్సి ఉంటుందని, దీనికి అనుగుణంగా మిల్లర్లు కొల్లేటరల్ బ్యాంకు గ్యారంటీ సిద్దం చేసుకోవాలని అన్నారు. రైస్ డెలివరీకి సంబంధించి గోదాముల సమస్య పరిష్కారం కోసం నూతన గోదాముల నిర్మాణం చేపట్టామని అన్నారు. రైస్ మిల్లులకు ఉన్న వివిధ సమస్యల సంబంధించి దరఖాస్తులు అందిస్తే ప్రభుత్వానికి నివేదించడం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షులు బొమ్మ రాజేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రతి సీజన్ 1,70,000 మెట్రిక్ టన్నులకు పైగా బియ్యం సరఫరా చేయాల్సి ఉంటుందని, ఇక్కడ గోదాముల ప్లేస్ సరిపోయేంతలేదని అన్నారు. గోడౌన్ సమస్య వల్ల దూర ప్రాంతాలకు బియ్యం డెలివరి సమయంలో రవాణా ఖర్చులు అందించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి చందన్ కుమార్, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీలత, సంబంధిత అధికారులు, మిల్లర్ లు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వపాఠశాలలో చదివే విద్యార్థులకు ఆదాయకుల ధృవీకరణ పత్రాలు మంజూరు చేయాలి

- కరీంనగర్ జిల్లా మహిళా అధ్యక్షురాలు కర్ర సత్య ప్రసన్న రెడ్డి



**రామడుగు, నవంబర్ 20(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఆదాయ కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని కరీంనగర్ ఎమ్మార్వోలకు .కరీంనగర్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న రెడ్డి.సత్యప్రసన్న మాట్లాడుతూ ఈ మధ్యలో తెలంగాణ ప్రభుత్వం EBC విద్యార్థులకు 4000 రూపాయల స్కాలర్ షిప్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.కావున ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు అందరు పేదవారు కావడం వల్ల ఆదాయ , కుల ధ్రువీకరణ పత్రాలు తీసుకోవడం కష్టంగా ఉంటుంది కాబట్టి పాఠశాల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులందరివీ అప్లికేషన్లు పూర్తి చేసి అటెస్ట్ చేసి ఎమ్మార్వో ఆఫీస్కు పంపిస్తే విద్యార్థులు సులభం అవుతుంది. ఇదివరకు కలెక్టర్ ఆదేశాను సారం పాఠశాలలకు కులం,ఆదాయం సర్టిఫికెట్ లు పంపించడం జరిగింది.ఇట్టి విషయాన్ని ఎమ్మార్వోలు విద్యార్థులకు సహాయం చేయాలని అన్నారు.

# పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధంగా ఉండాలి

**రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ రాణి కుముదిని**

**3 విడతల్లో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం**

**గ్రామపంచాయతీ ఎన్నికల సన్నద్ధతపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన ఎన్నికల సంఘం కమీషనర్**




**ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 20 (పిసిడబ్ల్యూ న్యూస్) :** గ్రామపంచాయతీ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అధికారులు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసి, సన్నద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ ఐ. రాణి కుముదిని అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ, ఓటర్ జాబితా తయారీపై రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్, జిల్లా కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. హైదరాబాద్ నుండి జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొనగా, కలెక్టరేట్ నుంచి పోలీస్ కమీషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ రాణి కుముదిని మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ ఎన్నికలు త్వరలో నిర్వహణకు ప్రభుత్వం నిర్ణయించిందని, సజావుగా ఎన్నికలు జరిగేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని అన్నారు. 3 విడతల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలను కుంటే, ప్రతి ఫేజ్ లో ఏ మండలాలు ఎన్నికలు జరగాలో జిల్లా వారీగా ప్రణాళికలు అందించాలని అన్నారు. పంచాయతీ తుది ఓటర్ జాబితాకు సంబంధించి ఫిర్యాదులు, అభ్యంతరాలను స్వీకరించి పరిష్కరించి, ప్రతి గ్రామ పంచాయతీకి సంబంధించి పోలింగ్ కేంద్రాలు, ఫోటోలతో కూడిన ఓటర్ జాబితా ప్రచురణకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత ఎంసిసి నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని అన్నారు. ఎంసిసి ఉల్లంఘనపై వచ్చే ప్రతి ఫిర్యాదు పరిష్కారానికి యంత్రాంగం సిద్ధం చేసుకోవాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ అధికారులతో మాట్లాడుతూ... గ్రామ పంచాయతీ, వార్డులకు సంబంధించి రిజర్వేషన్ ప్రక్రియ ఖరారు చేసి చెక్ చేసుకోవాలని, ప్రతి వర్గంలో మహిళలకు రిజర్వేషన్ 50 శాతం అమలు కావాల్సి ఉంటుందని అన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, జిల్లా పంచాయతి అధికారి ఆశాలత, జెడ్పి డిప్యూటీ సిఇఓ నాగపద్మజ, డివిజనల్ పంచాయతీ అధికారులు విజయలక్ష్మి, రాంబాబు, ఎన్నికల విభాగం సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కిక్ బాక్సింగ్ పోటీలలో రాష్ట్ర స్థాయికి ఎంపికైన ఆర్బిట్ విద్యార్థులు





**హన్మకొండ, నవంబర్ 20 (పిసిడబ్ల్యూ న్యూస్) :** హన్మకొండ జిల్లా హసన్ పర్తి మండలం, ఎల్లాపూర్ ఆర్బిట్ ఇ-టెక్నో పాఠశాల కు చెందిన విద్యార్థిని, విద్యార్థులు నవంబర్ 19 న జగిత్యాల జిల్లాలో జరిగిన కిక్ బాక్సింగ్ పోటీలలో పాల్గొని గెలుపొంది, రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్, కరస్పాండెంట్ చిట్టి రెడ్డి భగవాన్ రెడ్డి తెలిపారు.ఈ పోటీలలో పదవ తరగతికి చెందిన బి.దీక్ష వర్ధిని, తొమ్మిదో తరగతికి చెందిన ఎస్.రితిక, ఏడో తరగతి కి చెందిన ఎం. కృతిక జిల్లా ప్రధమ స్థాయి లో గెలుపొంది, బంగారు పథకాలు సాధించి, సంగారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పదవ తరగతికి చెందిన బి.సంజన, తొమ్మిదో తరగతి చెందిన ఆర్. ప్రణతి, ఏడవ తరగతికి చెందిన ఇ.తులసి శివాని, పి.సహస్ర జిల్లా ద్వితీయ స్థాయి లో గెలుపొంది, వెండి పథకాలు సాధించి సంగారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ కిక్ బాక్సింగ్ పోటీలలో పాల్గొన్న విద్యార్థిని, విద్యార్థులను, కోచ్ శివను పాఠశాల ప్రిన్సిపల్, కరస్పాండెంట్ చిట్టి రెడ్డి భగవాన్ రెడ్డి, పాఠశాల డైరెక్టర్ హారిక భగవాన్ రెడ్డి మరియు ఉపాధ్యాయ బృందం అభినందించారు.

# చాతల్ల కుటుంబాన్ని ఆత్మీయ పలకరింపు

- భారత రాష్ట్ర సమితి ప్రధాన కార్యదర్శి, డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్
- పశ్చిమ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, దాస్యం వినయ్ భాస్కర్



**హన్మకొండ, నవంబర్ 20 (పిసిడబ్ల్యూ న్యూస్) :** భారత రాష్ట్ర సమితి వర్ధన్నపేట నియోజకవర్గ నాయకులు చాతల్ల వేణుగోపాల్, స్వేరోస్ ఇంటర్నేషనల్ కో కన్వీనర్ చాతల్ల సదానందం తల్లి ఉపేంద్ర ఇటీవల అకాల మరణం చెందడం తో ఇట్టి విషయాన్ని తెలుసుకున్న భారత రాష్ట్ర సమితి ప్రధాన కార్యదర్శి, డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, పశ్చిమ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ స్వేరోస్ ఆత్మీయ పలకరింపు పేరుతో వారి స్వగృహం పెంబర్తి గ్రామానికి వచ్చి ఉపేంద్ర చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కుటుంబాన్ని ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలియజేసారు.భారత రాష్ట్ర సమితి హసన్ పర్తి మండల అధ్యక్షులు, బండి రజని కుమార్, కల్వల సుదర్శన్, మంద శ్యామ్, స్వేరో నాయకులు పుల్ల కిషన్, శిరీష, చింత సదనందం, శనిగరపు శ్రీనివాస్ , అమ్మఒడి శ్యామల, మంద మనోజ్, తెల్లూరి సురేష్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఖోఖో జిల్లా జట్టు ఎంపిక



**కల్లూరు ,నవంబర్ 20 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఉమ్మడి ఖమ్మం జిల్లా అండర్ 17 సంవత్సరాల బాలురు, బాలికల ఖమ్మం జిల్లా ఖోఖో జట్టు ఎంపిక చేయబడిందని సెలక్షన్ కమిటీ తెలిపారు. స్థానిక మినీ స్టేడియం క్రీడా ప్రాంగణంలో గురువారం 150 మంది క్రీడాకారులు భద్రాద్రి కొత్తగూడెం ఖమ్మం జిల్లాలో నలుమూలల నుంచి పాల్గొన్నారు.వీరిలో అత్యంత ప్రతిభ కనపరచినటువంటి క్రీడాకారులను ఎంపిక చేసినారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్టు సెలెక్ట్ చేయబడిన క్రీడాకారులు యాదాద్రి భువనగిరి జిల్లాలో జరిగేటటువంటి రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. సమాఖ్య కార్యదర్శి వై రామారావు, మండల విద్యాశాఖ అధికారి పత్తిపాటి నివేదిత,ఆర్గనైజింగ్ సెక్రటరీ బోడ బీమా, పసుపులేటి వీరరాఘవయ్య,సెలక్షన్ కమిటీ మెంబర్స్ పి నర్సయ్య, ఎస్ రామారావు, నక్క వెంకటేశ్వర్లు,ఏ కృష్ణ పవన్ కుమార్ వి కృష్ణారావు, వి రాజకుమారి,జి రమాదేవి, ఎస్కే రంజాన్,స్టేడియం కోర్సెస్ గౌతమ్, గోపి, శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయులు, వ్యాయామ దర్శకులు పాల్గొని క్రీడలను విజయవంతం చేయడం జరిగినది.క్రీడలలో పాల్గొనటానికి వచ్చినటువంటి 150 మంది క్రీడాకారులకు ఉచిత భోజనం వసతి ఏర్పాటు చేసిన పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఖమ్మం వాటికి కృతజ్ఞతలు తెలిపారు.

# ఆది భట్ల శ్రీ చైతన్య పాఠశాలలో నాసా కాంటెస్ట్ ప్రోగ్రాంలో కిట్ల పంపిణీ



**హన్మకొండ, నవంబర్ 20 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఆదిభట్ల స్థానిక ఆదిభట్ల శ్రీ చైతన్య పాఠశాలలో నాసా కాంటెస్ట్ ప్రోగ్రాంలో ఎంపికైన 213 మంది విద్యార్థులకు నాసా కిట్లను పంపిణీ చేశారని దిల్సుక్నగర్ శ్రీ చైతన్య విద్యా సంస్థల ఏజీఎం, టి. సతీష్ తెలిపారు .ఈ సందర్భంగా పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించగా డాక్టర్ కే రామ్మోహన్ రావు ప్రొఫెసర్ శ్రీ హిందూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో విజ్ఞాన శాస్త్రం సాంకేతిక రంగాలలో నైపుణ్యం పెంపొందించు కోవడం ద్వారా ఉన్నత స్థాయికి చేరుకోవాలని విద్యార్థులను ప్రోత్సహించారు. నాసా కాంటెస్ట్ కు ఎంపిక కావడం గర్వ కారణం అని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం ఇంకా పెద్ద విజయాలను సాధించాలని సూచించారు. అనంతరం ఎంపికైన 213 మంది విద్యార్థులకు నాసా కిట్లను అందజేశారు ఈ కార్యక్రమంలో ఆర్ ఐ, వెంకటరెడ్డి, రవీందర్ రెడ్డి.కో..ఆర్డినేటర్స్ రవికుమార్, పుల్లారావు. శ్రీ చైతన్య పాఠశాల ఆదిభట్ల ప్రిన్సిపల్ సతీష్, హుస్సేన్ వైస్ ప్రిన్సిపల్స్ చంద్రశేఖర్, వాహిని డీన్లు మహిపాల్ సాయి కుమార్, ఏవో లు వెంకటేశం, ఇస్మాయిల్ ఇన్చార్జ్ లు మరియు దిల్సుఖ్నగర్ జోన్ నాసా మెంటర్ సంతోష్. నాసా ఇన్చార్జి లు సైదులు, శ్రావణ్ ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు విద్యార్థిని, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# బ్రాహ్మణ సేవాసంఘం ఆధ్వర్యంలో వృద్ధ శరణాలయం ప్రారంభం



**ప్రొద్దుటూరు నవంబర్ 20 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రొద్దుటూరు మరియు చుట్టుప్రక్కల ప్రాంతాలలో వున్న వృద్ధ బ్రాహ్మణుల సౌకర్యార్థం అన్ని వసతులు, అత్యంత ప్రేమాప్యాయతలతో సనాతన సాంప్రదాయ ఆచార వ్యవహారాలను పాటిస్తూ ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవాసంఘం, ప్రొద్దుటూరు వారి సౌజన్యంతో శ్రీ అన్నపూర్ణేశ్వరి వృద్ధ శరణాలయం ను స్థానిక టీచర్స్ కాలనీ యందు శుక్రవారం ఉదయం 9 గంటలకు దండపాణి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత శ్రీ కామరాజు దండపాణిచే ప్రారంభిస్తున్నందులకు సంతోషిస్తూ, బ్రాహ్మణ బంధువులందరూ హాజరై తమ అమూల్యమైన సలహాలు, సహాయ సహకారాలు అందించి జయప్రదం చేయవలసిందిగా కోరిన యీ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవాసంఘం, ప్రొద్దుటూరు శాఖ అధ్యక్షుడు జీవకళ ధనుంజయశర్మ, కోశాధికారి తాటిపాటి రామగోపాలశర్మ, కార్యదర్శి మైదుకూరు సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# వాణిజ్య వర్గ సమిష్టి అభివృద్ధికి పాటుపడాలి

### బిజెపి రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు

### చాంబర్ - వ్యాపార వర్గానికి వేదిక

### చాంబర్ నిబంధనలకు కట్టుబడి కార్యవర్గం ఆదర్శంగా పనిచేయాలి

### ఛాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కమిటీకి శు భాకాంక్షలు తెలియజేసిన దేవకీ వాసుదేవరావు

**ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 20 (పిసిడబ్ల్యూ న్యూస్) :** చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కమిటీ వాణిజ్య వర్గ సమిష్టి అభివృద్ధికి పాటుపడాలని, ఛాంబర్ నియమ నిబంధనలకు కట్టుబడి పనిచేయాలని బిజెపి రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు అన్నారు. ఖమ్మం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికల్లో దిగుమతిశాఖ ఈసీ మెంబర్‌గా ఎన్నికైన జంగిలి రమణ గురువారం బిజెపి రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు నివాసానికి వెళ్లి వారిని ఆత్మీయంగా కలిశారు. దేవకి వాసుదేవరావు రమణను శాలువాతో సత్కరించి, ఘనంగా సన్మానించారు. ఎన్నికల్లో విజయం సాధించినందుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ.. నూతనంగా ఎన్నికైన ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి ఇతర సభ్యులకు శు భాకాంక్షలు తెలియజేశారు. ఖమ్మం వ్యాపార వర్గం కోసం ఎన్నికైన



నూతన కార్యవర్గం దృఢ సంకల్పంతో చాంబర్ అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఐక్యత బలమే అభివృద్ధికి మంత్రం అన్నారు. ఎన్నికైన కార్యవర్గ సభ్యులు వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాకుండా, వాణిజ్య వర్గం సమిష్టి అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని పనిచేయాలని ఆయన సూచించారు. కొత్త కమిటీ సభ్యులు ఆధునిక సాంకేతికతను వినియోగించి ఎంఎస్ఎంఈ లు, వ్యాపారులకు అవసరమైన మార్గదర్శకత్వం, వర్క్‌షాప్‌లు, సలహా సేవలను అందించే విధంగా వ్యాపార వర్గాన్ని బలపరచాలని సూచించారు. చాంబర్ – వ్యాపార వర్గానికి వేదిక అన్నారు. వాణిజ్య సమస్యలు, అభివృద్ధి ప్రణాళికలు, పెట్టుబడుల అవకాశా లను సమన్వయపరిచే వేదికగా ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఎప్పుడూ కీలక పాత్ర పోషించిందని, కొత్త కమిటీ ఈ బాధ్యతను మరింత సమర్థవంతంగా నిర్వర్తించాలని ఆయన అభిప్రాయపడ్డారు. వాణిజ్యవర్గ ఐక్యత, నిబద్ధత, సామర్థ్యం మాత్రమే అభివృద్ధికి దారి చూపుతాయని ఆయన పేర్కొన్నారు. నూతన కమిటీ వారు ఛాంబర్ భవనాన్ని ఆధునికీకరించి సభ్యుల కు సౌకర్యవంతంగా తీర్చిదిద్దాలి. పరిశోధన విభాగాన్ని ఏర్పాటు చేసి, వ్యాపార అవగాహన, మార్కెట్ విశ్లేషణలను అందించాలి. యువ వ్యాపారులకు మార్గదర్శనం, ఎంఎస్ఎంఈలకు సంబంధిం చిన ప్రభుత్వ పథకాల సదుపాయం వంటి కార్యక్రమాలను కొనసాగిం చాలని దేవకి వాసుదేవరావు అభిప్రాయపడ్డారు. కొత్త కమిటీ శాంతి, ఐక్యత, వినియోగదారుల సేవ, వ్యాపార అవకాశాలను పెంపొందిస్తూ, ఖమ్మం వ్యాపార వర్గానికి శక్తివంతమైన ముందడు గు వేస్తుందని విశ్వసిస్తున్నాం అని వారు అభిప్రాయపడ్డారు.

## 58వ జాతీయ గ్రంథాలయ ముంగింపు వారోత్సవాలలో మెరిసిన,విద్యార్థులు



**బొమ్మనహాల్ నవంబర్ 20 (పిసిడబ్ల్యూ న్యూస్) :**బొమ్మనహాల్ మండల పరిధిలోని గ్రంథాలయ శాఖ కార్యాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం గ్రంథాలయ అధికారి,ఏ. బాబాప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు,ఈ ముగింపు వేడుకల్లోభాగంగా,ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం,రన్నింగ్ రేస్,ఫ్రాగ్ రేస్ తదితర పోటీలు నిర్వహించారు, ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు,గ్రంథాలయం శాఖ అధ్వర్యంలో గెలుపొందిన విద్యార్థులకు, ఎంఈఓ.మల్లికార్జున,ప్రధానోపాధ్యాయురాలు సాయిలీల గ్రంథాలయ అధికారి బాబాప్రసాద్, చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు,కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన, ఎంఈఓ మల్లికార్జున,మరియు ప్రధానోపాధ్యాయురాలు సాయిలీలను,శాలువాతో సత్కరించారు,ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు,

## బోధన స్థాయిని పెంచేందుకు, టీచ్ టూల్ అమలు: ఎంఈఓ. మల్లికార్జున



**బొమ్మనహాల్ నవంబర్ 20 (పిసిడబ్ల్యూ న్యూస్) :-** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాల్ట్ ప్రోగ్రామ్‌లో భాగంగా టీచ్ టూల్ అబ్జర్వేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు,మండల విద్యాశాఖాధికారి మల్లికార్జున తెలిపారు, మండల విద్యాశాఖ కార్యాలయంలో రెండు రోజుల శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు,ఈ సందర్భంగా ఉపాధ్యాయుల బోధన నాణ్యత,తరగతి నిర్వహణ, విద్యార్థుల స్పందన వంటి అంశాలను పరిశీలించి,గ్రేడింగ్ ఇచ్చే విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని రిసోర్స్ పర్సన్స్ అమరేష్,మదు,వివరించారు. లోపాలను గుర్తించి ఇన్‌సర్వీస్ శిక్షణల ద్వారా మెరుగుదల సాధించేందుకు టీచ్ టూల్ సహాయపడుతుందని తెలిపారు. అదేవిదంగా మండలంలో ఎంపికైన అబ్జర్వర్లకు గురువారం,శుక్రవారం రోజుల్లో ప్రత్యేక శిక్షణ ఇవ్వబడింది. పాఠశాలల్లో చేసిన అబ్జర్వేషన్లను ఆన్‌లైన్‌లో ఎలా నమోదుచేయాలి, ఏ ప్రమాణాలపై మదింపు చేయాలి అనే అంశాలపై విపులంగా మార్గనిర్దేశం చేశారు,ఈ కార్యక్రమంలో ఎంఈఓ కార్యాలయ సిబ్బంది,రామాంజనేయులు, భాస్కర్,ఇస్మాయిల్,మంజప్ప, తదితరులు పాల్గొన్నారు.

## వైద్య విద్య ప్రైవేటీకరణను సంతకాలతో వ్యతిరేకించాలి



**ప్రొద్దుటూరు నవంబర్ 20 (పిసిడబ్ల్యూ న్యూస్) :** వైద్య విద్య ప్రైవేటీకరణను సంతకాలతో వ్యతిరేకించాలని మాజీ ఎమ్మెల్యే, వై.యస్.ఆర్.సి.పి రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ, మాజీ ముఖ్యమంత్రి వై.యస్ జగన్ మోహన్ రెడ్డి తలపెట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని పట్టణంలోని న్యూ బస్టాండ్ ఎదురుగా ఉన్న వస్త్రభారతి, న్యూ వస్త్రభారతి క్లాత్ మార్కెట్లలో మరియు పాత బస్టాండ్ ఎదురుగా ఉన్న వివేకానంద క్లాత్ మార్కెట్లలో సంతకాల సేకరణ చేపట్టారు. పట్టణ వైసీపీ అధ్యక్షులు భూమిరెడ్డి వంశీధర్ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 24న కలెక్టరేట్ ముందు ధర్నాను జయప్రదం చేయండి: సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్

**ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 20 (పిసిడబ్ల్యూ న్యూస్) :** అకాల వర్షాల కారణంగా దెబ్బతిన్న రైతాంగాన్ని ఆదుకోవాలని, పత్తి కొనుగోళ్లలో రైతాంగాన్ని ఇబ్బంది పెట్టే చర్యలను ఉపసంహరించుకోవాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకులు గుర్రం అచ్చయ్య, ఆవుల వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని ప్రసంగించారు. మొత్తం రైతాంగ పత్తిని సిసిఐ ద్వారా కొనుగోలు చేయాలని, కేంద్ర ప్రభుత్వం విధించే నిబంధనలను సడలించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల పథకాలను తక్షణమే అమలు చేయాలని, వితంతు ఆసరా పెన్షన్లు పెంచాలని, వ్యవసాయ కార్మికులకు సంవత్సరానికి 12000 ఇవ్వాలని తదితర డిమాండ్స్ తో సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఈనెల 24న కలెక్టరేట్ ముందు జరిగే ధర్నాని జయప్రదం చేయాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకులు గుర్రం అచ్చయ్య, ఆవుల వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. రైతాంగం ఎన్నడూ లేనంత కష్టాలు అనుభవిస్తుంటే ప్రభుత్వం రైతాంగం ని పట్టించుకోవటం




లేదని వారు ఆరోపించారు. పత్తి సరైన దిగుమతి రాక వచ్చిన దిగుమతి వర్షాలతో దెబ్బతిని అతలాకుతల మవుతుంటే కూడా అనేక ఆంక్షలు పెట్టి పత్తి కొనుగోలు చేయకుండా రైతులను హింసించడం ఏమిటని వారు ప్రశ్నించారు. పండించిన పత్తి పంటకు ఎలాంటి ఆంక్షలు లేకుండా తక్షణమే సిసిఐ ద్వారా కొనుగోలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని వారి సందర్భంగా అన్నారు. గత ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి కాంగ్రెస్ 6 గ్యారంటీల పథకాలను అమలు చేస్తామని పెద్ద ఎత్తున హామీ ఇచ్చి రెండు సంవత్సరాల గడిచినా కూడా ఈ రోజుకి వృద్ధుల, వితంతుల పెన్షన్లు పెంచలేదని, నూతన పెన్షన్ కూడా ఇవ్వలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఆరు గ్యారంటీల పథకాన్ని అమలు చేయాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. వరి కొనుగోలు కేంద్రాలను కూడా తక్షణమే ఏర్పాటుచేసి బోనస్ను కూడా రైతులకు చెల్లించాలని వారు కోరారు. రెండో విడత రైతు భరోసాని తక్షణమే విడుదల చేసి అప్పుల్లో ఉన్న రైతన్న ఆదుకోవాలని అన్నారు. ఈ సమస్యలపై జిల్లా వ్యాప్తంగా రైతులు కార్మికులు ప్రజలు పెద్ద సంఖ్యలో ఈ ధర్నాలో పాల్గొని జయప్రదం చేరిన వారు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్ శివలింగం, కొల్లేటి నాగేశ్వరరావు, జి రామయ్య, సివై పుల్లయ్య, బందెల వెంకయ్య, ఆవుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## స్కూల్ ఆటో పేరుతో నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు: ట్రాఫిక్ సిఐ సత్యనారాయణ



**ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 20 (పిసిడబ్ల్యూ న్యూస్) :** స్కూల్ ఆటో పేరుతో విద్యార్థులను పరిమితి మించి ఎక్కిస్తే సహించేది లేదని ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ తెలిపారు. గురువారం పాఠశాలల వాహనాలను ట్రాఫిక్ పోలీసులు తనిఖీ చేశారు. ఆటోల్లో పరిమితికి మించి విద్యార్థులు, స్కూల్ బ్యాగులు, లంచ్ బాక్సులు, వాటర్ బాటిళ్లతో కిక్కిరిసిపోయి ప్రయాణిస్తున్నారని గుర్తించి జరిమానా విధించారు. ఇలా ప్రయాణాలు చేయటం సరైంది కాదని.. చిన్న పొరపాటు జరిగినా ఘోరం తప్పదని, ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించడం కూడ రోడ్డు భద్రతా నిబంధనలను స్పష్టంగా ఉల్లంఘించటమే అని అన్నారు. ఈ రకమైన నిర్లక్ష్యపు రవాణా పద్ధతుల వల్లే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయనే విషయన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలని సూచించారు.

## రైతులకు ఆర్థిక సహకారం అందిద్దాం

- సహకార సంఘాల అధ్యక్షులతో ఎమ్మెల్యే కే ఈ సమీక్ష



**పత్తికొండ నవంబర్ 20 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సహకార సంఘాల ద్వారా రైతులకు ఆర్థికంగా సహకారం అందిద్దామని ఎమ్మెల్యే కేఈ శ్యాంకుమార్ అన్నారు. గురువారం క్యాంప్ కార్యాలయంలో ఆయన నియోజకవర్గ పరిధిలోని సహకార సంఘాల అధ్యక్షులతో సమీక్ష నిర్వహించారు. రైతులకు దీర్ఘకాలిక రుణాలను అందించాలని, సబ్సిడీపై వ్యవసాయాదారిత పనిముట్లను అందించాలన్నారు. అలాగే సబ్సిడీపై ఎరువులు అందించేందుకు కృషి చేయాలి అన్నారు. సమీక్షలో పత్తికొండ, మారెళ్ళ, ఉప్పర్లపల్లి, మద్దికేర, బురుజుల, కోయిలకొండ, క్రిష్ణగిరి, వెల్దుర్తి సహకార సంఘాల అధ్యక్షులు చందోలి రంగప్ప, ఎద్దులదొడ్డి ప్రభాకర్ రెడ్డి, అప్ప వేణు అప్ప వేణు, ఆనంద్, ఎర్రిస్వామి, నక్క నాగరాజు, శేషాద్రి, రమాకాంత్ రెడ్డిలు పాల్గొన్నారు.

## పుస్తక పఠనం జీవిత గతిని మారుస్తుంది

- గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సునీత
- గురుకుల డిగ్రీ కళాశాలలో ఘనంగా ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు





**ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 20 (పిసిడబ్ల్యూ న్యూస్) :** పుస్తక పఠనం జీవిత గతిని మారుస్తుందని ప్రతి ఒక్కరూ పుస్తకాలను చదవటం అలవాటు చేసుకోవాలని గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సునీత అన్నారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల నందు గురువారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా కళాశాల గ్రంధాలయంలో ముగింపు వారోత్సవాలను గ్రంథాలయ అధికారి డి.ఆశాజై, గ్రంథాలయ కమిటీ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటానికి పూలమాలను సమర్పించి, జ్యోతి ప్రజ్వలన గావించారు. అనంతరం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సునీత మాట్లాడుతూ... పుస్తకాల వలన ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని, పుస్తక పఠనం జీవిత గతిని మారుస్తుందని, మనల్ని ఉన్నత స్థితికి తీసుకెళు ందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఏ.సునీత, అధ్యాపక బృందం, విద్యార్థినులు పాల్గొని విజయవంతం చేశారు.

# వన్డే సిరీస్‌కు టీమిండియా కెప్టెన్‌గా రాహుల్!



**• దక్షిణాఫ్రికా వన్డేతో**

**రోహిత్, కోహ్లీ పునరాగమనం**

భారత్ -దక్షిణాఫ్రికా మధ్య జరుగుతున్న టెస్ట్ సిరీస్ ఉత్కంఠభరితంగా సాగుతోంది. మొదటి టెస్ట్ 30 పరుగుల తేడాతో ఓడిపోయిన తర్వాత, టీమ్ ఇండియా ఇప్పుడు నవంబర్ 22 నుంచి గౌహతిలో రెండో టెస్ట్ ఆడనుంది. దీని తరువాత, రెండు జట్లు నవంబర్ 30 నుంచి ప్రారంభమయ్యే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో తలపడనున్నాయి. వన్డే సిరీస్ కోసం బీసీసీఐ ఎలాంటి జట్టును సిద్ధం చేస్తుందో చాలా పేర్లు బయటకు వచ్చాయి. ఈసారి చాలా పెద్ద పేర్ల పునరాగమనం చర్చను మరింత పెంచింది. వన్డే సిరీస్‌కు కెప్టెన్సీ కెఎల్ రాహుల్‌కు దక్కే అవకాశం ఉంది. శుభ్‌మన్ గిల్ గాయం కారణంగా ఆడటం అనుమానంగా ఉంది. అటువంటి పరిస్థితిలో, రాహుల్‌ను కెప్టెన్‌గా నియమించడం దాదాపు ఖాయం. భారత్, దక్షిణాఫ్రికా మధ్య వన్డే మ్యాచ్‌లు నవంబర్ 30, డిసెంబర్ 3, డిసెంబర్ 6 తేదీల్లో జరగనున్నాయి.చాలా కాలం తర్వాత వన్డేల్లో భారత్ ఇద్దరు దిగ్గజ ఆటగాళ్ళు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఒకేసారి కనిపించారు. ఆస్ట్రేలియాతో జరిగిన ఇటీవలి వన్డే సిరీస్‌లో రోహిత్ అద్భుత ప్రదర్శన చేశాడు. ప్రారంభ మ్యాచ్‌లో తక్కువ పరుగులు చేసిన తర్వాత, అతను రెండో వన్డేలో అర్ధ సెంచరీ, మూడవ మ్యాచ్‌లో అద్భుతమైన సెంచరీ సాధించి ప్లేయర్ ఆఫ్ ద సిరీస్ అవార్డును గెలుచుకున్నాడు. విరాట్ కోహ్లీ కూడా తన క్లాస్‌తో అందరినీ ఆకట్టుకున్నాడు. మొదటి రెండు మ్యాచ్‌ల్లో విఫలమైన తర్వాత, అతను మూడవ వన్డేలో 74 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచి భారత్‌ను గెలిపించాడు. ఛేజింగ్‌లో తనకంటే గొప్పవారు లేరని మరోసారి నిరూపించాడు. దక్షిణాఫ్రికాతో జరిగే మ్యాచ్‌లో ఈ జోడీ జట్టుకు రన్ మెషిన్ అవుతుందని భావిస్తున్నారు. ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ఆసియా కప్‌లో గాయపడిన తర్వాత ఇప్పుడు పూర్తిగా కోలుకున్నాడు. అతని రాక టీమ్ ఇండియా బ్యాలెన్సింగ్‌ను మరింత బలోపేతం చేస్తుంది. హార్దిక్ బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ ముఖ్యమైన పాత్ర పోషిస్తాడు. వేగవంతమైన బౌలర్ జస్ప్రీత్ బుమ్రాకు ఆస్ట్రేలియాతో జరిగిన %వాణ×% సిరీస్‌లో విశ్రాంతి ఇచ్చారు, కాని ఇప్పుడు అతను కూడా వన్డే సిరీస్‌లో తిరిగి రావచ్చు. అతని ఉనికి భారత బౌలింగ్‌కు పదును పెడుతుంది. అదేవిధంగా, దేశవాళీ క్రికెట్‌లో నిరంతరం పరుగులు సాధిస్తున్న రుతురాజ్ గైక్వాడ్‌కు కూడా జట్టులో చోటు దక్కే అవకాశం ఉంది. అతని ఫామ్, స్థిరత్వం జట్టుకు పెద్ద ప్లస్ పాయింట్.

## 2026 మినీ వేలాన్ని ఆపేయండి



**• భారత మాజీ క్రికెటర్ రాబిన్ ఊతప్ప**

ఐపీఎల్ 2026 మినీ వేలాన్ని ఆపేయాలని బీసీసీఐకి భారత మాజీ క్రికెటర్ రాబిన్ ఊతప్ప సూచించాడు. ఈ వేలం ప్రక్రియను ఆపేసి ఏడాది పాటు ఆటగాళ్లను ట్రేడ్ చేసుకునే అవకాశం కల్పించాలన్నాడు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఐపీఎల్‌లో మార్పులు చేయాలని తెలిపాడు. రెండున్నర నెలల పాటు నిర్వహిస్తున్న ఈ టోర్నీని 6 నెలల టోర్నీగా మార్చాలని సూచించాడు. ఐపీఎల్‌లో కేకేఆర్‌కు ప్రాతినిథ్యం వహించిన రాబిన్ ఊతప్ప 205 మ్యాచ్‌లు ఆడి 4952 పరుగులు చేశాడు. 2014లో కేకేఆర్ టైటిల్ గెలవడంలో రాబిన్ ఊతప్ప 660 పరుగులతో కీలక పాత్ర పోషించాడు. తాజాగా ఐపీఎల్ గురించి మాట్లాడిన రాబిన్ ఊతప్ప.. లీగ్ స్వరూపాన్ని మార్చాలన్నాడు.'ఐపీఎల్ టోర్నీని స్టార్టప్ దశకు మించి తీసుకెళ్లడం లేదు. ప్రపంచంలోనే అత్యుత్తమ క్రికెట్ లీగ్ ఇది. మారుతున్న కాలానికి అనుగుణంగా టోర్నీని మార్చాలి. వేలం ప్రక్రియను నిలిపేసి ఏడాది పాటు ట్రేడ్ విండో తెరిచి ఉంచాలి. వేలాన్ని పక్కన పెట్టి డ్రాఫ్ట్ సిస్టమ్‌ను తీసుకు రావాలి. నేను ఐపీఎల్ ఆడుతున్నప్పటి నుంచి ఈ విషయం చెబుతున్నా. కానీ వారు టీవీ వినోదం గురించి మాత్రమే ఆలోచిస్తున్నారు. డ్రాఫ్ట్ విధానం అంతకంటే గొప్పది కావొచ్చు. ఇది అభిమానులను ఆకట్టుకుంటుంది. దీన్ని అమలు చేయండి. అంతేకాకుండా ఐపీఎల్ 6 నెలల లీగ్‌లాగా ఉండాలని నేను భావిస్తున్నాడు. మధ్యలో అంతర్జాతీయ మ్యాచ్‌లను నిర్వహించాలి. కానీ, ఐపీఎల్ అభివృద్ధి చెందాలి'అని రాబిన్ ఊతప్ప పేర్కొన్నారు. డ్రాఫ్ట్ సిస్టమ్ అంటే ఆటగాళ్లను సమాన పద్ధతిలో జట్లకు కేటాయించడానికి ఉపయోగించే విధానం. అత్యుత్తమ ప్రతిభను కనబర్చే క్రికెటర్లపై ఒక ఫ్రాంచైజీ గుత్తాధిపత్యం ఉండకుండా జట్ల బలబలాల మధ్య సమతుల్యం తీసుకురావడానికి దీన్ని ప్రవేశపెట్టారు. డ్రాఫ్ట్‌లో అర్హత ఉన్న ఆటగాళ్ల సమూహం నుంచి జట్లు వంతులవారీగా ఎంపిక చేసుకుంటాయి.

# రింకూ సింగ్ అద్భుతమైన సెంచరీ



భారత జట్టు దక్షిణాఫ్రికాతో రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ ఆడుతోంది. నవంబర్ 22న గౌహతిలో జరిగే రెండవ, చివరి మ్యాచ్‌లో ఇరు జట్లు తలపడనున్నాయి. ఇంతలో, భారత స్టార్ ఎడమచేతి వాటం బ్యాట్స్‌మన్ రింకూ సింగ్ రంజీ ట్రోఫీలో తన బ్యాటింగ్‌తో సంచలనం సృష్టించాడు. రంజీ ట్రోఫీ మ్యాచ్‌లో రింకూ సింగ్ అద్భుతమైన సెంచరీ సాధించాడు. వరుసగా ఫోర్లు, సిక్సర్లు బాదాడు. భారత జట్టు తరపున టెస్ట్ క్రికెట్ ఆడటానికి తన సంసిద్ధతను కూడా అతను సూచించాడు.2025-26 రంజీ ట్రోఫీలో తమిళనాడుపై జరిగిన మ్యాచ్‌లో భారత యువ బ్యాట్స్‌మన్ రింకు సింగ్ అద్భుతమైన సెంచరీ సాధించాడు. అతను 247 బంతులు ఎదుర్కొని 176 పరుగులు చేశాడు. రింకు సింగ్ అద్భుతమైన ఇన్నింగ్స్‌తో ఉత్తరప్రదేశ్ తొలి ఇన్నింగ్స్ లో 460 పరుగులు చేసి తమిళనాడుపై ఐదు పరుగుల ఆధిక్యాన్ని సంపాదించింది. రింకు తన ప్రత్యేకమైన స్వభావాన్ని ప్రదర్శించి మైదానం అంతటా అద్భుతమైన షాట్లు ఆడాడు. ఉత్తరప్రదేశ్ మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మన్ రింకు సింగ్ క్లిష్ట పరిస్థితుల్లో ఈ సెంచరీ చేశాడు. రింకు సింగ్ బ్యాటింగ్‌కు వచ్చే సమయానికి ఉత్తరప్రదేశ్ 149 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది. ఆ తర్వాత రింకు సింగ్ వచ్చి శివమ్ మావితో కలిసి అద్భుతమైన భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. జట్టును బలమైన స్థితిలో ఉంచాడు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఈ ఎడమచేతి వాటం బ్యాట్స్‌మన్ అద్భుతమైన రంజీ ట్రోఫీ సీజన్‌తో దేశీయ క్రికెట్‌లో తన సెంచరీల సంఖ్యను పెంచుకున్నాడు. తరచుగా అగ్రశ్రేణి %ఓఖ%20 బ్యాట్స్‌మన్‌గా పేరుగాంచిన రింకు సింగ్, టెస్ట్ క్రికెట్ ఆడే తన సామర్థ్యాన్ని మరోసారి ప్రదర్శించాడు. అతను దేశీయ క్రికెట్‌లో తన తొమ్మిదవ సెంచరీని సాధించాడు. భారత టెస్ట్ జట్టులో స్థానం కోసం తన వాదనను కూడా పదిలం చేసుకున్నాడు. ఈ సెంచరీ సెలెక్టర్లకు కూడా ఒక ముఖ్యమైన సందేశాన్ని పంపింది. రింకు సింగ్ దేశీయ టెస్ట్ కెరీర్‌లో 57 సగటుతో 3600 పరుగులు సాధించాడు. ఈ కాలంలో అతను తొమ్మిది సెంచరీలు, 22 హాఫ్ సెంచరీలు సాధించాడు. ఈ గణాంకాలు అతను రెడ్-బాల్ క్రికెట్‌లో కూడా స్థిరంగా పరుగులు సాధిస్తున్నాడని సూచిస్తున్నాయి. భవిష్యత్తులో అతను భారత టెస్ట్ జట్టులో కూడా స్థానం సంపాదించవచ్చు.

# బంగారు పతకానికి కూతవేటు దూరంలో.. ప్రపంచకప్ ఫైనల్‌లో బాక్సర్ నిఖత్ జరీన్



ప్రపంచ బాక్సింగ్ కప్ 2025 టోర్నీలో భారత మహిళా బాక్సర్ నిఖత్ జరీన్ ఆధిపత్యాన్ని చలాయిస్తుంది. ఇప్పటికే రెండుసార్లు ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన నిఖత్ జరీన్.. ఇప్పుడు మరోసారి ఫైనల్‌కు చేరి బంగారు పతకానికి కూతవేటు దూరంలో నిలిచింది. గురువారం జరిగిన పోరులో గెలిచి తుదిపోరుకు చేరడం ద్వారా నిఖత్ జరీన్ పతకాన్ని ఖాయం చేసుకుంది.మహిళల 51 కేజీల విభాగంలో జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో బరిలో దిగిన నిఖత్ జరీన్.. ఉజ్బెకిస్థాన్ బాక్సర్ గనీవా గుల్సెవర్‌ను మట్టికరిపించింది. బాక్సింగ్ న్యాయనిర్ణేతలు అందరూ ఆమెను ఏకగ్రీవంగా విజేతగా ప్రకటించారు. దీంతో ప్రపంచ బాక్సింగ్ కప్ 2025 టోర్నీ ఫైనల్లో నిఖత్.. చైనీస్ తైపీకి చెందిన గువో జి జువాన్ తో బంగారు పతకం కోసం పోటీ పడనుంది. ఈ సందర్భంగా తెలంగాణకి చెందిన బాక్సర్ నిఖత్ జరీన్ మాట్లాడింది. "చాలా ఏళ్ల తర్వాత మళ్లీ నాకు మెడల్ దక్కడం హ్యాపీగా ఉంది. రాబోయే రోజుల్లో ఇదే విధంగా ముందుకు సాగుతా. గతంలో సొంత గడ్డపై ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచా. ఇప్పుడు ఈ టోర్నీ సెమీఫైనల్‌లో గెలిచి.. ఫైనల్‌లో గోల్డ్ మెడల్ సాధిస్తానని ధీమాగా ఉన్నా"నని నిఖత్ జరీన్ చెప్పుకొచ్చారు. ప్రపంచ బాక్సింగ్ కప్ ఛాంపియన్‌షిప్‌లో ఇప్పటి వరకు ఐదుగురు బాక్సర్లు ఫైనల్ చేరారు. వారిలో 57 కిలోల విభాగం సెమీస్‌లో జాస్మిన్ 5-0తో కజకిస్థాన్‌కు చెందిన సర్సెన్బెక్‌పై నెగ్గింది. 57 కిలోల విభాగంలో జాదుమణి సింగ్, 55 కిలోల విభాగంలో పవన్ బర్త్వాల్, 60 కిలోల విభాగంలో సచిన్ సివాచ్, 70 కిలోల విభాగంలో హితేశ్ గులియా కూడా ఫైనల్లో అడుగుపెట్టారు.

# ఐపీఎల్ ఫ్రాంచైజీలు భారీ బిడ్స్‌కు రెడీ

**• పలువురు స్టార్ ప్లేయర్ల కోసం సిద్ధం**



అబుదాబిలో డిసెంబర్ 16న ఐపీఎల్ 2026 మినీ వేలం జరగనుంది. ఇక పలువురు స్టార్ ప్లేయర్ల కోసం.. ఐపీఎల్ ఫ్రాంచైజీలు భారీ బిడ్స్‌కు రెడీ అవుతున్నాయి. అయితే ఈసారి చాలా మంది ఆటగాళ్లు వేలంలోకి వస్తుండగా.. వారిపై భారీ ధర పలికే ఛాన్స్ ఉంది. ఇప్పటివరకూ ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక ధరకు అమ్ముడైన రిషబ్ పంత్ రికార్డును కూడా బద్దలు కొట్టేందుకు.. ఓ ముగ్గురు ప్లేయర్లు లైన్‌లో సిద్ధంగా ఉన్నారు. ఐపీఎల్ 19వ సీజన్ వేలం డిసెంబర్ 16న అబుదాబిలో జరగనుంది. అయితే ఇది మినీ వేలం కావడంతో ఒకే రోజులో క్లోజ్ అవ్వనుంది. కామెరాన్ గ్రీన్ నుండి ఆండ్రీ రస్సెల్ వరకు.. పలువురు స్టార్ ఆటగాళ్ల కోసం ఐపీఎల్ ఫ్రాంచైజీలు భారీ బిడ్లకు సిద్ధమవుతున్నాయి. పంత్ పేరు మీదున్న రూ. 27 కోట్ల రికార్డు కూడా చెరిగే అవకాశం ఉంది. ఈ వేలంలో అందరి కంటే ముందున్న ఆటగాడు.. ఆస్ట్రేలియాకు చెందిన విధ్వంసక ఆల్‌రౌండర్ కామెరాన్ గ్రీన్. ఐపీఎల్ 2026 మినీ వేలంలోకి కామెరాన్ కూడా రానున్నాడు. ఐపీఎల్ 2024లో ఈ ప్లేయర్‌ని ఆర్సీబీ..ముంబై ఇండియన్స్ నుండి రూ. 17.5 కోట్లకు ట్రేడ్ చేసుకుంది. అయితే ఐపీఎల్ 2025 సీజన్‌లో కామెరాన్ గ్రీన్ గాయం కారణంగా ఆడలేకపోయాడు. కానీ ఈసారి ఫుల్ ఫామ్‌తో తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో మెగా వేలంలో ఈ ఆటగాడి కోసం ఫ్రాంచైజీల మధ్య గట్టి పోటీ ఉండబోతోంది. కామెరాన్ గ్రీన్‌పై రూ. 25 కోట్ల వరకు బిడ్ పడే అవకాశం ఉంది. ఇక 2014 ఐపీఎల్ నుండి కోల్‌కతా నైట్ రైడర్స్ తరఫున ఆడుతున్న ఆండ్రీ రస్సెల్‌ను..ఈసారి రిలీజ్ చేయడంతో మినీ వేలంలోకి రాబోతున్నాడు. గత సీజన్‌లో ఈ ఆల్‌రౌండర్‌ను మెగా వేలంలో రూ. 12 కోట్లు చెల్లించి రిటైన్ చేసుకున్నారు. బ్యాట్, బాల్ రెండింటితోనూ మ్యాచ్‌ను మలుపు తిప్పగల సామర్థ్యం ఇతని సొంతం. అందువల్ల ఆండ్రీ రస్సెల్‌పై భారీ బిడ్ పడే అవకాశాలు ఎక్కువగానే ఉన్నాయి. గత సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ తరఫున ఆడిన శ్రీలంక ఫాస్ట్ బౌలర్ మతీష పతిరానాను.. ఈసారి విడుదల చేసింది. ఐపీఎల్ 2025లో మతీషను రూ. 13 కోట్లు చెల్లించి రిటైన్ చేసుకున్నారు. ఈ సూపర్ బౌలర్‌కు డెత్ ఓవర్లలో వికెట్లు తీయగల అద్భుతమైన సామర్థ్యం ఉంది. మతీష పతిరానాపై కూడా రూ. 10 కోట్ల వరకు బిడ్ పడే ఛాన్స్ ఉంది.

# నేటి నుండి యాషెస్ సిరీస్



**• సిద్ధంగా ఇంగ్లాండ్- ఆస్ట్రేలియా జట్లు**

**• పెర్త్ వేదికగా తొలి టెస్టు ప్రారంభం**

టెస్టు క్రికెట్‌లో ప్రతిష్ఠాత్మక సిరీస్ యాషెస్ కు అంతా రెడీ అయ్యింది. ఆస్ట్రేలియా వేదికగా మరికొన్ని గంటల్లోనే ఈ సిరీస్ ప్రారంభం కానుంది. ఇంగ్లాండ్- ఆస్ట్రేలియా జట్ల మధ్య జరిగే ఈ యాషెస్ టెస్టు సిరీస్‌ను క్రికెట్‌లో అతిపెద్ద టెస్టు సిరీస్‌గా అభివర్ణిస్తారు. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా నవంబర్ 21న పెర్త్ వేదికగా తొలి టెస్టు ప్రారంభం కానుంది. ఈసారి ఈ సిరీస్‌కు ఆస్ట్రేలియా ఆతిథ్యం ఇస్తుంది. ఇరుజట్ల ఆటగాళ్లు ఇప్పటికే నెట్స్‌లో తీవ్రంగా శ్రమిస్తున్నారు. ద్వైపాక్షిక సిరీస్‌లు ఎన్ని ఉన్నప్పటికీ, ఇరుజట్లు ఈ సిరీస్‌ను మాత్రం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటాయి. ఈ సిరీస్‌లో నెగ్గాలని తీవ్రంగా ప్రయత్నిస్తాయి. ఈ క్రమంలోనే కాంట్రవర్సీలు, ప్రత్యర్థుల మధ్య మాటల యుద్ధాలు ఇవన్నీ ఇంకొక ఎత్తు! ఇందులో బ్యాటర్ సెంచరీ చేసినా, బౌలర్ ఐదు వికెట్లు కూల్చినా ఆ ప్లేయర్ పేరు మార్మోగిపోతుంది. అలాంటి సిరీస్‌కు ఆసీస్, ఇంగ్లాండ్ ప్లేయర్లు రెడీ అయ్యి, టెస్టు క్రికెట్ ఫ్యాన్స్‌కు ఫుల్ మజా ఇవ్వనున్నారు.ఆస్ట్రేలియా పిచ్‌లపై ఫాస్ట్ బౌలర్ల ఆధిపత్యం ఉంది. రేపు పెర్త్ స్టేడియంలో జరగనున్న యాషెస్ తొలి మ్యాచ్‌లోనూ పిచ్ పేసర్లకే సహకరించవచ్చు! అలాగే ఈ పిచ్‌పై టెస్టుల్లో ఆసీస్‌కు మంచి ట్రాక్ రికార్డ్ ఉంది. ఆతిథ్య ఆస్ట్రేలియా ఇక్కడ నాలుగు మ్యాచ్‌లు గెలిచింది. పెర్త్ స్టేడియంలో జరిగిన అన్ని టెస్ట్ మ్యాచ్‌ల్లో ముందుగా బ్యాటింగ్ చేసిన జట్టు గెలిచింది. అందుకే ఈ మ్యాచ్‌లో టాస్ కీలక పాత్ర పోషిస్తుంది. టాస్ గెలిచిన జట్టు ముందుగా బ్యాటింగ్ తీసుకనే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. పెర్త్ వేదికగా జరిగనున్న తొలి టెస్టు ఉదయం 7:50 గంటలకు ప్రారంభమవుతుంది. దీనికి అరగంట ముందు టాస్ పడుతుంది. టీవీలో స్టార్ స్పోర్ట్స్‌కు సంబంధించిన ఛానెళ్లలో లైవ్ చూడవచ్చు. అలాగే జియో హాట్‌స్టార్ ఓటీటీలో లైవ్ స్ట్రీమింగ్ చేయవచ్చు. అయితే దీనికి సబ్‌స్క్రిప్షన్ తీలుకోవాల్సి ఉంటుంది. కానీ జియో యూజర్లకు ఎంపిక చేసిన ప్లాన్‌పై ఫ్రీగా అందిస్తోంది. కాగా, ఈ సిరీస్ 1882- 83లో ప్రారంభమైంది. అంటే దీని చరిత్ర 140 సంవత్సరాలకు పైమాటే! ఇరు దేశాలకు ఈ సిరీస్ ప్రతిష్ఠాత్మకం. ఇప్పటిదాకా యాషెస్‌లో 73 సిరీస్‌లు జరిగాయి. చివరిసారిగా 2023లో సిరీస్ జరిగింది. అప్పుడు ఆస్ట్రేలియా విజేతగా నిలిచింది. ఓవరాల్‌గా ఆసీస్ 34సార్లు నెగ్గగా, ఇంగ్లాండ్ 32 సార్లు సిరీస్‌లో దక్కించుకుంది. 7 సిరీస్‌లు డ్రా గా ముగిశాయి. ఇక టెస్టుల విషయానికొస్తే, 364 టెస్టు మ్యాచ్‌ల్లో ఆసీస్- ఇంగ్లాండ్ తలపడ్డాయి. ఇందులోనూ ఆస్ట్రేలియా ఆధిపత్యం స్పష్టంగా కనిపిస్తుంది. ఆసీస్ 152 టెస్టుల్లో విజయం సాధించగా, ఇంగ్లాండ్ 112 మ్యాచ్‌ల్లో నెగ్గింది. మరో 97 మ్యాచ్‌లు డ్రా అయ్యాయి. ఇంగ్లాండ్ జట్టు: బెన్ డకెట్, జాక్ క్రాలే, ఓల్లీ పోప్, జో రూట్, హ్యారీ బ్రూక్, బెన్ స్టోక్స్ (కెప్టెన్), జేమీ స్మిత్ (వికెట్ కీపర్), గస్ అట్కిన్సన్, జోఫ్రా ఆర్చర్, మార్క్ వుడ్, బ్రైడాన్ కార్సే, షోయబ్ బషీర్, జాకబ్ బెథెల్, మాథ్యూ పాట్స్, జోష్ టోంగ్, విల్ జాక్స్ ఆస్ట్రేలియా జట్టు : ఉస్మాన్ ఖవాజా, జేక్ వెదరాల్, మార్నస్ లాబుషేన్,స్టీవ్ స్మిత్ (కెప్టెన్), ట్రావిస్ హెడ్, కామెరాన్ గ్రీన్, అలెక్స్ కేరీ (వికెట్ కీపర్), మిచెల్ స్టార్క్, నాథన్ లియాన్, బ్రెండన్ డాగెట్, స్కాట్ బోలాండ్, బ్యూ వెబ్‌స్టర్, జోష్ ఇంగ్లిస్, మైఖేల్ నెసెర్

# పైరసీపై కొత్త పోరు..

## రూ.99కే సినిమా టికెట్ ప్రకటించిన ఈటీవీ విన్!




పైరసీపై పోరాటంలో భాగంగా ప్రముఖ ఓటీటీ సంస్థ ఈటీవీ విన్ ఒక కీలక ముందడుగు వేసింది. తమ సంస్థ నిర్మించిన 'రాజు వెడ్స్ రాంబాయి' సినిమా టికెట్ ధరను కేవలం రూ.99గా నిర్ణయించినట్లు ప్రకటించింది. సింగిల్ థియేటర్లలో ఈ ధర వర్తిస్తుండగా, మల్టీప్లెక్స్ థియేటర్లలో రూ.105గా ఉంటుందని తెలిపింది. ఈ నిర్ణయం ద్వారా ప్రేక్షకులను థియేటర్లకు రప్పించి, పైరసీని అరికట్టవచ్చని సంస్థ భావిస్తోంది. బుధవారం రాత్రి హైదరాబాద్‌లో 'రాజు వెడ్స్ రాంబాయి' ప్రీ-రిలీజ్ వేడుక జరిగింది. ఈ కార్యక్రమంలో ఈటీవీ విన్ బిజినెస్ హెడ్ సాయికృష్ణ మాట్లాడుతూ, "ఇటీవల ఐబొమ్మ రవి అరెస్ట్ తర్వాత, సినిమా టికెట్, పాప్‌కార్న్ ధరలు తగ్గితే థియేటర్లకు వస్తామని చాలా మంది అభిప్రాయపడ్డారు. వారి అభిప్రాయాన్ని గౌరవించే మేము ఈ నిర్ణయం తీసుకున్నాం" అని వివరించారు. రవిని అరెస్ట్ చేసిన తెలంగాణ పోలీసులకు ఆయన అభినందనలు తెలిపారు.గతంలో తమ సంస్థ నుంచి వచ్చిన 'క' సినిమాను పైరసీ కాకుండా విజయవంతంగా అడ్డుకున్నామని సాయికృష్ణ గుర్తుచేశారు. "పైరసీ మన నుంచే మొదలైంది, దాన్ని ఆపే బాధ్యత కూడా మనదే. ప్రతి ఒక్కరూ థియేటర్లలో సినిమా చూసి సహకరించాలి" అని ఆయన ప్రేక్షకులను కోరారు. అఖిల్, తేజస్విని జంటగా నటించిన ఈ చిత్రానికి సాయిలు కంపాటి దర్శకత్వం వహించారు. ఈ సినిమా నవంబర్ 21న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యువ హీరో కిరణ్ అబ్బవరం హాజరు కాగా, చిత్రబృందం మొత్తం పాల్గొంది.


# ఏప్రిల్లో ఉస్తాద్ భగత్ సింగ్



2023లో బ్రో మూవీతో పలకరించాక రెండేళ్లకు పైగా బాక్సాఫీస్ పోటీకి దూరంగా ఉన్న పవర్ స్టార్ పవన్ కళ్యాణ్.. ఈ ఏడాది రెండు నెలల వ్యవధిలో రెండు సినిమాలతో పలకరించాడు. జులైలో హరిహర వీరమల్లు రిలీజైతే.. సెప్టెంబర్లో ఓజీ విడులైంది. మొదటి సినిమా నిరాశపరిచినా.. రెండో మూవీ అభిమానులతో పాటు సామాన్య ప్రేక్షకులనూ మెప్పించింది. ఈ రెండు చిత్రాలను పూర్తి చేసిన వెంటనే పవన్.. ఉస్తాద్ భగత్ సింగ్ మూవీని కూడా టేకప్ చేయడం.. వరుసగా కాల్ షీట్స్ ఇచ్చి చకచకా తన పార్ట్ షూటింగ్ అంతా పూర్తి చేయడం తెలిసిందే. మరి ఈ మూవీ రిలీజ్ ఎప్పుడు అని అభిమానులు ఎదురు చూస్తున్నారు. ఐతే పవన్ తన పార్ట్ వరకు చిత్రీకరణ పూర్తి చేసినప్పటికీ.. ఇంకా కొంత షూట్ మిగిలే ఉండడంతో సినిమా కొంచెం ఆలస్యం కానున్నట్లు ఇప్పటికే చిత్ర వర్గాలు సంకేతాలు ఇచ్చాయి. వచ్చే రెండు మూడు నెలల్లో అయితే రిలీజ్‌కు స్కోప్ లేదు. అలాంటపుడు వేసవికే విడుదల ఉండొచ్చని భావిస్తున్నారు. ఇప్పుడు స్వయంగా నిర్మాత రవిశంకర్ ఉస్తాద్ భగత్ సింగ్ రిలీజ్ గురించి క్లారిటీ ఇచ్చారు. ఈ చిత్రం ఏప్రిల్లో విడుదలవుతుందని ఆయన ప్రకటించారు. తమ ప్రొడక్షన్లో రానున్న కొత్త చిత్రం ఆంధ్ర కింగ్ తాలూకా ప్రమోషన్లలో భాగంగా ఆయన తమ సంస్థ సినిమాల గురించి మాట్లాడారు. రామ్ చరణ్ పెద్ది మూవీ మార్చిలోనే రాబోతోందని నొక్కి వక్కాణించిన రవిశంకర్... ఉస్తాద్ భగత్ సింగ్ చిత్రీకరణ పూర్తి చేసుకుందని, వేసవిలో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని తెలిపారు.సంక్రాంతికి సినిమాను రెడీ చేసే అవకాశమున్నా.. అప్పుడు చిరు సినిమా మన శంకర వరప్రసాద్ ఉండడంతో వేసవి వైపు దృష్టి మళ్లింది. మార్చిలో రామ్ చరణ్ సినిమా వస్తుంది కాబట్టి.. ఆ నెలను విడిచిపెట్టి ఏప్రిల్‌ను ఎంచుకున్నారు. మేలో ఎలాగూ చిరు మరో సినిమా విశ్వంభర వస్తుందనే అంచనాలున్నాయి. హరీష్ శంకర్ డైరెక్ట్ చేస్తున్న ఉస్తాద్ భగత్ సింగ్‌లో చిరు సరసన శ్రీలీల, రాశి ఖన్నా నటించారు.

# జపాన్ ఫ్యాన్స్‌ను కలిసేందుకు ప్రభాస్..

## ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్న డార్లింగ్!



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ తన జపాన్ అభిమానులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకునేందుకు సిద్ధమవుతున్నారు. తన సినిమాలకు జపాన్‌లో లభిస్తున్న ఆదరణ నేపథ్యంలో, అక్కడి అభిమానులను స్వయంగా కలిసేందుకు ఆయన వచ్చే నెలలో జపాన్ పర్యటనకు వెళ్లనున్నట్లు తెలుస్తోంది. ఈ పర్యటన కోసం ప్రస్తుతం నటిస్తున్న 'ఫౌజీ' సినిమా చిత్రీకరణ నుంచి ఆయన స్వల్ప విరామం తీసుకోనున్నారు.'బాహుబలి' నుంచి ఇటీవల విడుదలైన 'కల్కి 2898 ఎ.డి' వరకు ప్రభాస్ చిత్రాలు జపాన్‌లో భారీ విజయాన్ని సాధించాయి. దీంతో అక్కడ ఆయనకు బలమైన అభిమానగణం ఏర్పడింది. నిజానికి 'కల్కి' విడుదల సమయంలోనే జపాన్ వెళ్లాలని ప్రభాస్ భావించారు. అయితే, అప్పుడు కాలి గాయంతో బాధపడుతుండటంతో తన పర్యటనను వాయిదా వేసుకున్నారు. త్వరలోనే తప్పకుండా వస్తానని ఓ వీడియో సందేశం ద్వారా అభిమానులకు హామీ ఇచ్చారు.ఇప్పుడు ఆ వాగ్దానాన్ని నెరవేర్చేందుకు ఆయన సిద్ధమయ్యారు. మరోవైపు, ఈ నెలాఖరులో ప్రభాస్ తన కొత్త సినిమా 'స్పిరిట్'ను ప్రారంభించనున్నారు. ఈ చిత్రం కోసం ఆయన తన లుక్‌ను మార్చుకునే పనిలో ఉన్నారని సమాచారం. జపాన్ పర్యటన ముగించుకుని తిరిగి వచ్చాక, కొత్త సినిమాల షూటింగ్‌లతో పాటు 'రాజాసాబ్' ప్రచార కార్యక్రమాలతో ఆయన బిజీ అవ్వనున్నారు.

# మోడ్రన్ స్త్రీ: ఉపాసన ఫేవరిజంపై జాతీయ చర్చ

స్త్రీ ఆకాశంలో సగం. పురుషుడిలోను సగం. కానీ సంఘంలో స్త్రీ స్థానం ఎక్కడ ఉంది? మగువకు అర్థరాత్రి స్వాతంత్ర్యం సంపూర్ణంగా అందుతోందా? ఇవన్నీ ఇప్పటికీ శేష ప్రశ్నలుగానే ఉన్నాయి. అయితే ఆడది తనకు తానుగా ఆర్థిక స్వావలంబన సాధించాలని, మానసిక శారీరక - ఆరోగ్యం సహా స్వయం ఉపాధిలోను సమృద్ధిగా ఉన్నప్పుడే తనను తాను సంస్కరించుకోగలదనే అభిప్రాయం వ్యక్తం చేసారు ఉపాసన. స్త్రీలు వివాహం చేసుకున్నా కెరీర్ ని కూడా కొనసాగించాలని, అయితే దీనికోసం భాగస్వామితో కలిసి నిర్ణయం తీసుకోవాలని ఉపాసన సూచించారు. నేటి మహిళలకు ఆర్థిక స్థిరత్వం చాలా అవసరం. తన కాళ్లపై తాను నిలబడాలి. అలాగే స్త్రీ ఇతరుల ఒత్తిడితో పని లేకుండా తనకు తగ్గ వ్యక్తిని ఎంపిక చేసుకునే అవకాశం ఉండాలి! అని కూడా ఉపాసన అన్నారు. నేటితరం ఇతరుల ఒత్తిడి కంటే నిజాయితీతో కూడిన సంబంధం కోసం వివాహం చేసుకోవాలని నిర్ణయించుకుంటున్నారని కూడా ఉపాసన అన్నారు. ప్రస్తుతం ఉపాసన అభిప్రాయం జాతీయ స్థాయిలో డిబేట్ గా మారింది. పెళ్లిలో అస్థిరత, గృహ హింస గురించి ఉపాసన గతంలో తన ధృక్పథాన్ని వెల్లడించారు. స్త్రీలను గౌరవించి పూజించకపోతే దేవుడి గుడిలో దేవత విగ్రహం ఎందుకు? అని కూడా ప్రశ్నించారు. ఇప్పుడు స్త్రీ ఆర్థిక భద్రత గురించి, భర్త విషయంలో స్త్రీల ఎంపిక గురించి ఉపాసన సూటిగా మాట్లాడటం ఆసక్తిని పెంచుతోంది. కెరీర్- పెళ్లి కచ్చితంగా అమ్మాయి విషయంలో కలిసే ఉండాలని కూడా కుండబద్దలు కొట్టారు. ప్రతి స్త్రీ భవిష్యత్ ని భద్రంగా ఉంచుకోవాలనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసారు. స్త్రీలు తమ ఆరోగ్యం విషయంలో జాగ్రత్తగా ఉండాలి. మానసిక శ్రేయస్సు చాలా ముఖ్యమని కూడా సూచించారు. మహిళలు తమ సొంత లక్ష్యాలను, సంతృప్తికరమైన జీవితాన్ని గడపడానికి టైమ్ ని మ్యానేజ్ చేయడం నేర్చుకోవాలని కూడా అన్నారు. ఉపాసన ఆదర్శవంతమైన సూచనలపై ఇప్పుడు జాతీయ స్థాయిలో డిబేట్ కొనసాగుతోంది. ఉపాసనపై నెటిజనులు ప్రశంసలు కురిపిస్తున్నారు.




# అందాల భామకి ఎక్కడ తేడా కొడుతుంది..?



అందం అభినయం ఉంటే చాలు వరుస ఛాన్స్ లు వచ్చేస్తాయి. కానీ ఆ రెండిటిలో పాటు లక్ అనే ఫ్యాక్టర్ కూడా ఉండాలి లేదంటే కాస్త ఇబ్బంది పడక తప్పదు. ప్రస్తుతం అలాంటి పరిస్థితుల్లోనే ఉంది అందాల భామ భాగ్య శ్రీ బోర్స్. మామూలుగా అయితే రవితేజ సినిమాతో ఎంట్రీ ఇచ్చిన హీరోయిన్ కి హిట్ క్రేజ్ రావడమే కాదు కెరీర్ అదిరిపోతుంది. అదే దారిలో మిస్టర్ బచ్చన్ తో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది భాగ్య శ్రీ బోర్స్. ఐతే ఆ సినిమా కమర్షియల్ గా వర్క్ అవుట్ కాలేదు కాబట్టి ఫస్ట్ షాక్ తగిలినట్టు అయ్యింది.భాగ్య శ్రీ బోర్స్ థర్డ్ అటెంప్ట్ గా వచ్చిన కాంత.. ఐతే అది ఫ్లాప్ అయినా అమ్మడికి వరుస ఛాన్స్ లు వచ్చాయి. రెండో సినిమాగా రిలీజైన విజయ్ దేవరకొండ కింగ్ డమ్ మీద చాలా హోప్స్ పెట్టుకుంది భాగ్య శ్రీ. ఐతే ఆ సినిమా కూడా నిరాశపరచింది. ముఖ్యంగా భాగ్య శ్రీ రోల్ కూడా రన్ టైమ్ లిమిటేషన్స్ వల్ల క్లారిటీ లేకుండా పోయింది. ఇక థర్డ్ అటెంప్ట్ గా వచ్చిన కాంత సినిమా కూడా కమర్షియల్ సక్సెస్ అందుకోలేదు. తెలుగులో దుల్కర్ సినిమా అంటే కచ్చితంగా సూపర్ హిట్టే అనే రేంజ్ క్రేజ్ ఏర్పరచుకున్నాడు. అలాంటి దుల్కర్ తో కాంత సినిమా చేసిన భాగ్య శ్రీ ఆ సినిమాతో కూడా ఫెయిల్యూర్ చవిచూసింది. ఐతే 3 సినిమాల్లో కింగ్ డమ్ లో తప్పితే మిగతా రెండిటిలో అటు గ్లామర్ పరంగా యాక్టింగ్ పరంగా భాగ్య శ్రీకి మంచి మార్కులే వేశారు ఆడియన్స్. రామ్ తో జత కట్టిన ఈ అమ్మడు.. ఇక ఫైనల్ గా అమ్మడి చేతిలో ఉన్న ఒకే ఒక్క సినిమా ఆంధ్రా కింగ్ తాలూకా. రామ్ తో జత కట్టిన ఈ అమ్మడు అతనితో తొలి హిట్ అందుకుంటుందా అన్నది ఎగ్జైటింగ్ గా ఉంది. రామ్ తో తొలి పరిచయమైన ఇలియానా, కీర్తి సురేష్ లాంటి వాళ్లు స్టార్ హీరోయిన్స్ గా ఒక రేంజ్ కి వెళ్లారు. మరి అదే దారిలో భాగ్యానికి రామ్ సినిమా సక్సెస్ అందిస్తుందేమో చూడాలి. రామ్ భాగ్య శ్రీ చేసిన ఆంధ్రా కింగ్ తాలూకా సినిమా ప్రమోషన్స్ అయితే ఇంప్రెసివ్ గా ఉన్నాయి.. ఈ సినిమా ఒక ఫ్యాన్ బయోపిక్ గా మేకర్స్ చెబుతూ వస్తున్నారు. మరి సినిమాతో భాగ్యానికి ఏమేరకు లక్ కలిసి వస్తుందో చూడాలి. ఆంధ్రా కింగ్ తాలూకా రిజల్ట్ ని బట్టే భాగ్య శ్రీ కెరీర్ ఆధారపడి ఉంటుందని చెప్పొచ్చు. ముఖ్యంగా సినిమా హిట్ పడితే అమ్మడు కూడా మరింత రెచ్చిపోదామనే ప్లాన్ తోనే ఉంది. మరి భాగ్యం కోరుకున్న ఆ ఒక్క హిట్ సినిమా ఆంధ్రా కింగ్ అవుతుందా లేదా అన్నది ఈ మంత్ ఎండ్ సినిమా రిలీజ్ అయ్యాక తెలుస్తుంది. హీరో రామ్ కూడా ఆంధ్రా కింగ్ తాలూకా సినిమా మీద చాలా హోప్స్ పెట్టుకునాడు. అతను కూడా ఈమధ్య వరుస ఫ్లాపులతో కెరీర్ ట్రాక్ తప్పాడు.

# 'కొదమసింహం' రీ రిలీజ్..

## పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్న చిరంజీవి



మెగాస్టార్ చిరంజీవి నటించిన క్లాసిక్ కౌబాయ్ చిత్రం 'కొదమసింహం' 35 ఏళ్ల తర్వాత మళ్లీ థియేటర్లలో సందడి చేయనుంది. 1990లో విడుదలైన ఈ సినిమాను ఈ నెల 21న రీ రిలీజ్ చేయనున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో చిత్ర యూనిట్ ప్రెస్ మీట్ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి చిరంజీవి హాజరుకాకపోయినా, ఓ స్పెషల్ వీడియో ద్వారా సినిమాకు సంబంధించిన మధుర జ్ఞాపకాలను పంచుకున్నారు.కౌబాయ్ సినిమాలంటే తనకు చాలా ఇష్టమని, కానీ అలాంటి చిత్రంలో తాను నటిస్తానని ఎప్పుడూ ఊహించలేదని చిరంజీవి అన్నారు. "అప్పటికే కృష్ణ గారు నటించిన 'మోసగాళ్లకు మోసగాడు' సంచలనం సృష్టించింది. ఆ సమయంలో మరో కౌబాయ్ సినిమా చేయడం సాహసమే. నిర్మాత కైకాల నాగేశ్వరరావు గారు దర్శకుడు మురళీ మోహన్ రావును పరిచయం చేసి కథ చెప్పించారు. కథ నచ్చడంతో వెంటనే అంగీకరించాను. తొలిసారి గడ్డం పెంచి నటించిన సినిమా ఇదే" అని గుర్తుచేసుకున్నారు. ఈ చిత్రంలో మోహన్‌బాబు పోషించిన 'సుడిగాలి' పాత్ర తన ఫేవరెట్ అని చిరంజీవి తెలిపారు. ఆ పాత్రకు మోహన్‌బాబు తప్ప మరెవరూ న్యాయం చేయలేరని ప్రశంసించారు. లెజెండరీ నటుడు ప్రాణ్‌తో కలిసి పనిచేయడం అదృష్టమన్నారు. రాజ్-కోటి అద్భుతమైన సంగీతం అందించారని, ప్రభుదేవా కొరియోగ్రఫీ హైలైట్‌గా నిలిచిందని చెప్పారు. ఓ పాటలో గోడపైకి డ్యాన్స్ చేస్తూ వెళ్లే సీన్‌ను హాలీవుడ్ సినిమా స్ఫూర్తితో తీశామని, అప్పట్లో అది అందరినీ ఆశ్చర్యపరిచిందని అన్నారు. ఈ సినిమాతో రామ్ చరణ్‌కు ఉన్న అనుబంధాన్ని కూడా చిరంజీవి పంచుకున్నారు. "చిన్నప్పుడు చరణ్ భోజనం చేయాలంటే వాళ్లమ్మ ఈ సినిమా క్యాసెట్ పెట్టాల్సిందే. అప్పుడే వాడు అన్నం తినేవాడు" అని నవ్వుతూ చెప్పారు. ఈ తరం ప్రేక్షకులు కూడా 'కొదమసింహం' చిత్రాన్ని తప్పకుండా ఆస్వాదిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.